

# శ్రీ పొట్టిశ్రీరాములు నెల్లూరు వార్త

## సోమశిల నీటిమట్టం



**అనంతసాగరం, నవంబరు 25, ప్రభాతవార్త :** మండలంలోని సోమశిల జలాశయానికి ఎగువ ప్రాంతాల నుంచి బుధవారం సాయంత్రానికి 11826 క్యూసెక్కుల వంతునవరద ప్రవాహం నమోదైంది. జలాశయం పూర్తిసామర్థ్యం 78 టిఎంసిలు కాగా ప్రస్తుతం జలాశయం లో 73.054 టిఎంసిల నీరు నిల్వ ఉంది. ఎస్ఎఫ్‌సికి 200, ఎస్ఎఫ్‌సికి 400, పెన్నా డెల్టాకు 0, కండలేరు వరద కాలువకు 0 క్యూసెక్కులు వంతున నీటిని విడుదల చేస్తున్నారు. ప్రస్తుతం 99.905 మీటర్ల మేర నీటిమట్టం నమోదైందని జలాశయం అధికారులు తెలిపారు.

## కలెక్టరేట్‌లో న్యాయ దినోత్సవ వేడుకలు

**- కార్యాలయ సిబంది చేత ప్రతిజ్ఞ చేయించిన జేసీ వెంకటేశ్వర్లు**



**నెల్లూరు కలెక్టరేట్, నవంబర్ 26, ప్రభాతవార్త** జాతీయ న్యాయ దినోత్సవం సందర్భంగా బుధవారం స్థానిక కలెక్టర్ కార్యాలయంలోని ఎస్ఆర్ శంకరన్ వీడియో కాన్ఫరెన్స్ హాలు నందు ఏర్పాటుచేసిన ప్రత్యేక కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ ఎం. వెంకటేశ్వర్లు, జిల్లా రెవిన్యూ అధికారి విజయకుమార్ కలెక్టరేట్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు. అందరి చేత ప్రతిజ్ఞ చేయించిన అనంతరం జాయింట్ కలెక్టర్ ఎం. వెంకటేశ్వర్లు మాట్లాడుతూ దేశ ప్రజల హక్కులు, బాధ్యతలు ప్రజాస్వామ్య విలువలకు భారత రాజ్యాంగం మూల స్తంభం, భారత రాజ్యాంగం సమానత్వం, న్యాయం, స్వేచ్ఛ, సౌభ్రాతృత్వం వంటి శాశ్వత విలువలను ప్రతి పౌరుడికి హామీ ఇస్తుంది. రాజ్యాంగ రూపకర్త డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ దూరదృష్టి వల్లే భారతదేశం ప్రపంచంలోనే అతిపెద్ద ప్రజాస్వామ్యంగా నిలిచింది. పౌరులు తమ హక్కులను వినియోగించుకోవడమే కాకుండా రాజ్యాంగం పేర్కొన్న బాధ్యతలను కూడా పాటించాలి. యువత, విద్యార్థులు రాజ్యాంగంపై అవగాహన పెంపొందించుకుని దేశ అభివృద్ధిలో చురుకైన పాత్ర పోషించాలని పిలుపునిచ్చారు. సామాజిక సమానత్వం, శాంతి, సామరస్యం, జాతీయ ఐక్యతను కాపాడుతూ రాజ్యాంగ విలువలను గౌరవించడం ప్రతి పౌరుడి బాధ్యత అని అన్నారు.

## సమాచార పౌర సంబంధాల శాఖ కార్యాలయంలో జాతీయ న్యాయ దినోత్సవం

**- కార్యాలయ సిబ్బందిచే ప్రతిజ్ఞ చేయించిన డిడి వేణుగోపాల్ రెడ్డి**



**నెల్లూరు కలెక్టరేట్, నవంబర్ 26, ప్రభాతవార్త** బుధవారం జాతీయ న్యాయ దినోత్సవం సందర్భంగా కలెక్టరేట్ ప్రాంగణంలోని జిల్లా సమాచార పౌర సంబంధాల శాఖ కార్యాలయంలో సిబ్బంది చేత జిల్లా సమాచార పౌర సంబంధాల శాఖ అధికారి పి. వేణుగోపాల్ రెడ్డి, ప్రతిజ్ఞ చెయించారు. ఈ కార్యక్రమం లోకార్యాలయ సిబ్బంది అందరూ పాల్గొని ప్రతిజ్ఞ చేశారు.

## బిల్లులు లేని సిగరెట్లు పట్టివేత

**- రూ. 20 లక్షల సరుకు స్వాధీనం**



**నెల్లూరు క్రైమ్, నవంబర్ 26, ప్రభాతవార్త:** బిల్లులు లేకుండా అక్రమంగా రవాణా చేస్తున్న సిగరెట్ ప్యాకెట్లు, గుట్కా ప్యాకెట్లను నెల్లూరు విజిలెన్స్ అధికారులు పట్టుకున్నారు. నెల్లూరు సిటీలోని జేమ్స్ గార్డెన్, వెంకట్రామాపురం రెండవ వీధిలోని ఓ పార్సెల్ సర్వీస్ నందు అక్రమంగా బిల్లులు లేకుండా సిగరెట్లు, పాన్ మసాలాలు రవాణా అవుతున్నాయని నమ్మదగ్గ సమాచారం మేరకు బుధవారం జిల్లా విజిలెన్స్ అండ్ ఎన్ఫోర్స్‌మెంట్ అధికారులు, రాష్ట్ర బిఫీగి అధికారులు కలిసి సంయుక్తంగా ఆకస్మిక దాడులు నిర్వహించి సోదాలు జరిపారు. అనుమానాస్పదంగా వున్న 27 కార్టన్ బాక్సులను గుర్తించి తనిఖీ చేయగా అందులో 24 బాక్సుల సిగరెట్స్ 3 బాక్సుల పాన్ మసాలా ప్యాకెట్లు ఉన్నాయి. ట్రాన్స్‌పోర్ట్ సర్వీస్ వారిని బిల్లులు చూపించమని కోరగా వారు ఎటువంటి బిల్లులు లేవని తెలిపారు. వెంటనే అధికారులు వాటిని స్వాధీనం చేసుకుని తదుపరి చర్యలు నిమిత్తం జీఎస్టీ కార్యాలయానికి తరలించారు. సరుకు మొత్తం విలువ సుమారు రూ 20 లక్షలుగా ఉంటుందని ప్రాథమికంగా నిర్ధారించారు. ఈ దాడుల్లో విజిలెన్స్ సీఐ నరసింహారావు, డిసిటిఓలు విష్ణు, సుబ్బారావులు పాల్గొన్నారు.

## కావలి ఏఎంసీ నందు సమీక్ష సమావేశము



**కావలి, నవంబర్ 26, ప్రభాతవార్త:** కావలి,మద్దూరు పాడు కావలి వ్యవసాయ మార్కెట్ కమిటీ యార్డు ప్రాంగణం నందు ఏఎంసీ చైర్మన్ పోతుగంటి అలేఖ్య అధ్యక్షతన ముఖ్య అతిథిగా కావలి శాసనసభ్యులు, ఏఎంసి దగుమాటి వెంకట కృష్ణారెడ్డి పాల్గొని సమీక్ష సమావేశాన్ని నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా నూతనంగా ఏర్పాటుచేసిన పాలకవర్గ సభ్యుల శిలాఫలకాన్ని ఎమ్మెల్యే ఆవిష్కరించడం జరిగింది. ఈ సమావేశంలో అనేక అభివృద్ధి కార్యక్రమాలకు సంబంధించిన ముఖ్యమైన అంశాలను చర్చించి నిర్ణయాలు తీసుకోవడం జరిగింది. రైతు బజార్ అభివృద్ధికి 55లక్షల రూపాయల ప్రతిపాదన, రైతులకు మెరుగైన మార్కెట్ సౌకర్యాలు అందించేందుకు రైతు బజార్ విస్తరణ పనుల కోసం ప్రతిపాదనలు సిద్ధం చేయడం జరిగింది. కార్యాలయ గోదాముల నిర్వహణకు 96 లక్షల రూపాయల వ్యవసాయ పంటలనిల్వ, నిర్వహణ, కార్యకలాపాల బలోపేతం కోసం నూతన గోదాముల అభివృద్ధి, మరమ్మతులు, మార్కెట్ కార్యాలయం సౌకర్యాల కోసం నిధుల ప్రతిపాదనలు గుంటూరు మార్కెటింగ్ సంచాలకులకు పంపేందుకు ఆమోదం తెలిపారు. కావలి నియోజకవర్గంలోని గ్రామీణ రహదారుల కోసం 1135 లక్షల రూపాయల పంటలు,ఉత్పత్తుల రవాణాకు సౌకర్యంగా ఉండే విధంగా గ్రామాల్లో పగడ్బందీ రోడ్లు వేసేందుకు భారీ మొత్తంతో ప్రతిపాదనలు సిద్ధం చేయడం జరిగింది.వ్యవసాయ పంటల పరిశీలన (ఫుడ్ గ్రేడ్) ల్యాబ్,నీటి నాణ్యత పరీక్షా కేంద్రం,గ్రామాల్లో పశువుల బోనుల నిర్మాణం వంటి ప్రతిపాదనలు సంబంధిత అధికారులకు పంపేందుకు నిర్ణయం తీసుకోవడం జరిగింది.ఈ సందర్భంగా మార్కెట్ కమిటీ పరిధిలో సాగుతున్న పనులు, రైతులకు అందిస్తున్న సదుపాయాలు, రాబోయే కొనుగోలు సీజన్‌లో తీసుకోవాల్సిన ఏర్పాట్లు వంటి పలు అంశాలపై సుదీర్ఘంగా చర్చ జరిగింది.ఈ సమావేశంలో మార్కెట్ కమిటీ పాలకవర్గ సభ్యులు,సంబంధిత విభాగాల అధికారులు, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

## సంఘటన స్థలానికి కావలి ఎమ్మెల్యే కావ్య



**జలదంకి, నవంబరు 26, ప్రభాతవార్త :** మండలం గట్టుపల్లి చింతలపాలెం లో మంగళవారం దారుణ హత్యకు గురైన గొట్టిపాటి ప్రసాద్ నాయుడు విషయం తెలుసుకున్న కావలి ఎమ్మెల్యే దగ్గు మాటి కృష్ణారెడ్డి ఉటాహుటిన చింతలపాలెం వెళ్లారు. హత్య వివరాలను పోలీసులు అడిగి తెలుసుకున్నారు. ఎమ్మెల్యేను చూసిన వెంటనే ప్రసాద్ నాయుడు కుటుంబ సభ్యులు కన్నీరు మున్నేరయ్యారు. కుటుంబాన్ని ఓదార్చిన ఎమ్మెల్యే కావ్య కృష్ణారెడ్డి నిందితులను కఠినంగా శిక్షి స్తామని తెలిపారు. ఈ హత్య దారుణమైనదిగా ఆయన అభివర్ణించారు.

## గట్టుపల్లి చింతలపాలెం లో టిడిపి నేత ప్రసాద్ నాయుడు దారుణ హత్య



**జలదంకి, నవంబరు 26, ప్రభాతవార్త :** జలదంకి మండలం గట్టుపల్లి చింతలపాలెంలో తెలుగుదేశం పార్టీ నాయకులు గొట్టిపాటి ప్రసాద్ నాయుడు మంగళవారం దారుణ హత్యకు గురయ్యాడు... గ్రామంలోని తన కోళ్ల ఫారం లో పనులు చేస్తుండగా గుర్తు తెలియని దుండగులు కోళ్లు కావాలంటూ వచ్చి ఈ హత్య కు పాల్పడినట్లు చెప్పుకుంటున్నారు. ఈ దారుణ హత్య మండలంలో కలకలం రేపింది.. ఎవరు ఎందుకు హత్య చేసి ఉంటారన్న అనుమానంతో చర్చ సాగుతుంది... ఇది రాజకీయ హత్య వ్యక్తిగతంగా జరిగిన మర్డరా అంటూ మండలవాసులు చర్చించుకుంటున్నారు... పట్టపగలు కోళ్ల ఫారం సమీపంలో దాదాపు 200 మంది పైగా ఓ కర్మ కతువుల్లో నిమగ్నమైన సమయంలో కూతవేటు దూరంలో ఈ హత్య జరగడం సంచలనం రేపింది... గుర్తుతెలియని ఇద్దరు యువకులు కోళ్లు కావాలంటూ ప్రసాద్ నాయుడుతో మాట్లాడటం అక్కడ ఉన్న మరో వ్యక్తి గమనించారని చెప్పుకుంటున్నారు.. ఆవ్యక్తి వేరే పని కోసం గ్రామంలోనికి వెళ్ళగా ఈ స్వల్ప సమయంలోనే హత్య జరిగిందని అంటున్నారు... ఈ విషయం మండలంలో దావనముల వ్యాపించింది.. ఎస్సై లతీఫ్ ఒనిసా తన సిబ్బందితో హుటాహుటిన చింతలపాలెం వెళ్లారు.. దేహాన్ని పరిశీలించారు.. కావలి డిఎస్పి శ్రీధర్ సిఐలు వెంకటనారాయ ణ, గిరిబాబు, ఫిరోజ్ ఖాన్, రాజేశ్వరరావు లు సంఘటన స్థలానికి వెళ్లి పరిశీలించారు. క్లూస్ టీం, డాగ్స్ టీం వచ్చి వివరాలు సేకరించారు. డాగ్ స్క్వార్డ్ ఆ ప్రాంగణంలో తిరిగి స్థానిక రామాలయం వద్దకు వెళ్ళింది. డి.ఎస్.పి మాట్లాడుతూ అన్ని కోణాలలో దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు.



## రైతుల ముఖాల్లో చిరునవ్వులు పూయిస్తున్న అన్నదాత సుఖీభవ

**- పిఎం కిసాన్ నిధులు - జిల్లాలో 1,95,866 మంది రైతులకు రూ. 130.20 కోట్లు జమ**
**- ఇచ్చిన హామీ మేరకు మూడు విడతల్లో ఏడాదికి రూ.20వేలు**
**- రెండు విడతల్లో రూ.14వేలు జమ చేసిన ప్రభుత్వం**
**- నిధుల విడుదల పట్ల హర్షం వ్యక్తం చేస్తున్న అన్నదాతలు**



**నెల్లూరు కలెక్టరేట్, నవంబర్ 26, ప్రభాతవార్త** నెల్లూరు జిల్లాలో రబీ సీజన్ పనులు మొదలైన సమయంలో, ప్రభుత్వం జమ చేసిన పెట్టుబడి సాయం రైతులకు పెద్ద ఊరటనిచ్చింది. ఆరుగాలం శ్రమించే అన్నదాతలకు చేయూతనందించాలనే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన అన్నదాత సుఖీభవ పిఎం కిసాన్ పథకం రైతులకు వరంగా నిలిచింది. ఏడాదికి మూడు విడతల్లో మొత్తం రూ.20వేలు పెట్టుబడిసాయం అందిస్తామని ప్రభుత్వం హామీ ఇచ్చినట్లుగానే ఇప్పటికే రెండో విడతతో కలిపి రైతుల ఖాతాల్లో రూ.14వేలు జమ కావడంతో వారిలో ఆనందం వెల్లివిరుస్తోంది. వ్యవసాయ సీజన్ ప్రారంభానికి ముందే పెట్టుబడిసాయంగా రాష్ట్రప్రభుత్వం రూ.5వేలు, కేంద్రప్రభుత్వం పిఎం కిసాన్ ద్వారా రూ. 2వేలు మొత్తం రూ. 7వేలు రైతుల ఖాతాల్లో జమ చేయడం వారికి ఎంతో ఉపయోగపడుతుంది.

### - జిల్లాలో 1,95,866 మంది రైతులకు రూ. 130.20 కోట్లు జమ

జిల్లా వ్యాప్తంగా 1,95,866 మంది రైతులకు రూ. 130.20 కోట్లు నగదును అన్నదాత సుఖీభవ పిఎం కిసాన్ రెండో విడత చెల్లింపులను రైతుల ఖాతాలకు నేరుగా ప్రభుత్వం జమచేసింది. ఉదయగిరి నియోజకవర్గంలో 45275 మంది లబ్ధిదారులకు రూ. 30.18 కోట్లు, ఆత్మకూరు నియోజకవర్గంలో 34223 మందికి రూ. 22.95 కోట్లు, కావలి నియోజకవర్గంలో 18305 మందికి రూ. 11.93 కోట్లు, కోవూరు నియోజకవర్గంలో 16938 మందికి రూ. 10.94 కోట్లు, సర్వేపల్లి నియోజకవర్గంలో 27958 మందికి రూ. 18.59 కోట్లు, నెల్లూరు నియోజకవర్గంలో 5299 మందికి రూ. 3.48 కోట్లు, వెంకటగిరి నియోజకవర్గంలో 16015 మందికి రూ. 10.64 కోట్లు, కందుకూరు నియోజకవర్గంలో 31853 మందికి రూ. 21.46 కోట్లు రైతుల మేర రైతులకు లబ్ధి చేకూరింది.

### - రైతుల అభిప్రాయాలు

**- వ్యవసాయ ఖర్చులకు ఉపయోగపడుతున్నాయి**
**- ఎస్‌కె జిలానీ బాషా, రైతు, కొడవలూరు**



ఈ ఖరీఫ్ సీజన్‌కు ముందుగానే ప్రభుత్వం అన్నదాతసుఖీభవ డబ్బులు జమ చేయడం వల్ల మా వ్యవసాయఖర్చులకు ఎంతో ఉపయోగపడ్డాయి. గతంలో ప్రతిసారి పెట్టుబడిసాయం కోసం కొంత ఇబ్బందులుపడే వాళ్లం. ఇప్పుడు ప్రభుత్వం పూర్తి ఉచితంగా పెట్టుబడిసాయంగా డబ్బులు అందించడం చాలా ఆనందంగా ఉంది. అలాగే వర్షాలు పుష్కలంగా కురిసి సోమశిల, కండలేరు జలాశయాల నుంచి నీటిని విడుదల చేయడంతో సాగునీటి ఇబ్బందులు కూడా లేవు. అన్నదాతలందరి తరపున ప్రభుత్వానికి, సీఎం చంద్రబాబు కి ప్రత్యేక కృతజ్ఞతలు తెలుపుకుంటున్నాను.



**- గతం కంటే అధికంగా డబ్బులు జమ చేయడం సంతోషంగా ఉంది**
**- అంతటి పెంచల నారాయణ, మరుపూరు**

గతంలో ఏడాదికి కేవలం 13500 మాత్రమే ఇచ్చేవారు. ఇప్పుడు రూ.20వేలు ఇస్తామని చెప్పి, చెప్పిన మాట ప్రకారం రెండు విడతల్లో రూ.14 వేలు ప్రభుత్వం నా బ్యాంకు అకౌంట్‌లో జమచేసింది. చాలా సంతోషంగా ఉంది. నాకు 2.25 సెంట్ల పొలంలో వరిసాగుకు వరినారుమళ్లు, ఎరువులు కొనుగోలు చేశాను. గత ఏడాది 7వేలు, ఈసారి 7వేలు జమచేసిన రైతుల పక్షపాతి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

**- అర్హులందరికి అన్నదాత సుఖీభవ.. పిఎం కిసాన్**
**- కలెక్టర్ హిమాన్షు శుక్ల**

జిల్లాలో అర్హులందరికీ పారదర్శకంగా అన్నదాత సుఖీభవ..పిఎం కిసాన్ నిధులను జమ చేశాం. వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో అర్హుల వివరాలు సేకరించి బ్యాంకు ఖాతాలకు నగదు జమచేశాం. ఇంకా అర్హత కలిగి ఉండి ఎవరికైనా నగదు జమకాకపోతే సమీపంలోని సచివాలయాలను, రైతుసేవా కేంద్రాలను తగిన ఆధారాలతో సంప్రదించాలని కలెక్టర్ హిమాన్షు శుక్ల సూచించారు.

## త్రాగు నీటి సమస్యకు శాశ్వత పరిష్కారం : ఎమ్మెల్యే



**పొదలకూరు, నవంబర్ 26, ప్రభాతవార్త** త్రాగు నీటి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపుతున్నామని, 35 విలేజ్ హెల్త్ క్లినిక్ భవనాల నిర్మాణానికి నిధులు మంజూరు చేశామని సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి వెల్లడించారు. బుధవారం ఎమ్మెల్యే సోమిరెడ్డి పొదలకూరులో పర్యటించా రు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రూ.92 లక్షలతో పొదలకూరు పీఏసీఎస్ నూతన భవన నిర్మాణానికి శంకుస్థాపన చేసుకోవడం సంతోషమన్నారు. పీఏసీఎస్ భవనం ముందుభాగంలో వాణిజ్య సముదాయం నిర్మిస్తే అదనపు ఆదాయ వనరుగా మారుతుందని అన్నారు. వ్యవసాయ అనుబంధ పరిశ్రమలు పెట్టే వారికి కేవలం పావలా వడ్డీతో రూ.2 కోట్ల వరకు రుణ సౌకర్యం అందుబాటులో ఉందన్నారు. రైతులతో పాటు యువత ఆ పరిశ్రమల ఏర్పాటు దిశగా ఆలోచించాల్సిన అవసరం ఉందన్నారు. పొదలకూరుతో పాటు మర్రిపల్లికి తాగునీటి సరఫరాలో సమస్య తలెత్తిందని, ఆ సమస్యకు పరిష్కారంగా రూ. 2.40 కోట్లతో కండలేరు నుంచి నేరుగా నిర్మించిన పైపులైనును ప్రారంభించామన్నారు.

- ❖ ఇకపై ఎలాంటి సమస్యలు లేకుండా తాగునీటి సరఫరా జరుగుతుందని చెప్పారు. సమస్యలను ఎప్పటికప్పుడు తెలుసుకుని పరిష్కరించడంలో ముందున్నామన్నారు. కేంద్ర ప్టభుత్వ నిధులు 80 శాతం, రాష్ట్ర ప్రభుత్వ నిధులు 20 శాతంతో నిర్మించి విలేజ్ హెల్త్ క్లినిక్‌ల నిర్మాణాన్ని వైసీపీ హయాంలో గాలికొదిలేశారన్నారు.
- ❖ కూటమి ప్రభుత్వం వచ్చాక ఒక్క సర్వేపల్లి నియోజకవర్గంలోనే 35 భవనాల నిర్మాణానికి నిధులు మంజూరు చేశారని తెలిపారు. అన్ని వసతులతో కూడిన భవనాలను రూ.55 లక్షల చొప్పున నిధులు వెచ్చించి నిర్మిస్తామని నిన్న వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ ప్రకటించారని పేర్కొన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నిధులు, జిల్లా కేంద్ర సహకార బ్యాంకు నిధులతో పాటు సీఎస్ఆర్ ఫండ్‌తో వీలైనన్ని పనులు చేయడమే లక్ష్యంగా పనిచేస్తున్నామన్నారు.
- ❖ కూటమి ప్రభుత్వం వచ్చాక సర్వేపల్లి నియోజకవర్గంలో ఇప్పటి వరకు 3 వేల మందికి పైగా గిరిజనులకు ఆధార్ కార్డులు ఇప్పించామని, ఇంకా పలువురు తమకు ఆధార్ కార్డులు లేవని చెబుతున్నారని, ప్రతి ఒక్కరికీ ఆధార్ కార్డులు, రేషన్ కార్డులు ఇప్పించి ప్రభుత్వ పథకాలు ఇప్పించే బాధ్యత అధికారులు, సచివాలయ ఉద్యోగులదే వేలాది మంది గిరిజనులకు కనీసం ఆధార్ కార్డులు లేకుండా గత ఐదేళ్లూ ఏమి చేసినట్టు, రోజూ తిట్టడం, అడ్డంగా దోచుకోవడం తప్ప ప్రజలకు చేసిందేమీ లేదన్నారు. డీసీసీబీ చైర్మన్ మెట్టుకూరి ధనుంజయరెడ్డి మాట్లాడూతూ సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి, పొదలకూరు పీఏసీఎస్ చైర్మన్ మస్తాన్ బాబు సహకారంతో త్వరలోనే పొదలకూరులో డీసీసీబీ బ్రాంచ్ ఏర్పాటు చేయబోతున్నామన్నారు.
- ❖ పీఏసీఎస్ కార్యాలయం కోసం నిర్మించబోతున్న భవనంలోనే జిల్లా కేంద్ర సహకార బ్యాంకు శాఖ ఏర్పాటు చేస్తామన్నారు. వాణిజ్య సముదాయం నిర్మాణానికి కూడా సంపూర్ణ సహకారం అందిస్తామని తెలిపారు. పొదలకూరు పీఏసీఎస్ కు ధాన్యం కొనుగోళ్లకు సంబంధించి సివిల్ సప్లయిస్ శాఖ రూ.40 లక్షలు చెల్లించాల్సి వుంది
- ❖ ఆ నిధులకు అదనంగా డీసీసీబీ నిధులు రూ.50 లక్షలు మంజూరు చేస్తామన్నారు. జిల్లాలో అత్యుత్తమంగా నడుస్తున్న సొసైటీల్లో పొదలకూరు పీఏసీఎస్ ఒకటి అని అన్నారు.
- ❖ డీసీసీబీతో పాటు పీఏసీఎస్ అందిస్తున్న అన్ని అవకాశాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు, కార్యకర్తలు, రైతులు తదితరులఉ పాల్గొన్నారు.

## ప్రజా సమస్యలు నాయకులకు, అధికారులకు పట్టదా

**- సూపర్ సిక్స్ హామీలను సూపర్ హిట్ చేస్తాం : ఎమ్మెల్యే**



**విడవలూరు, నవంబర్ 26 ప్రభాతవార్త :** మండల ప్రజా సమస్యలను నాయకులు, సచివాలయం సిబ్బంది ఎందుకు పట్టించుకోవడం లేదని ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి మండిపడ్డారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో జరిగిన ప్రజా దర్బార్ కార్యక్రమానికి ఎమ్మెల్యే రావడంతో నాయకులు, స్వాగతం పలికారు. మండల ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని వివిధ సమస్యలపై ఎమ్మెల్యేకు వినతులు అందజేశారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గతంలో తట్టెడు మట్టికి నోచుకోని గ్రామీణ ప్రాంతాలలో రోడ్లు వేస్తున్నాం, గత ప్రభుత్వం 15 ఆర్థిక సంఘం నిధులు దుర్వినియోగం చేసిందన్నారు. ప్రజా దర్బార్ కేవలం ఒక రోజు కార్యక్రమం కాదు నిరంతర ప్రక్రియ అనే ప్రజలకు తెలియజేశారు.అధికారులు ప్రజలు తెలిపే సమస్యలను పరిగణంలో తీసుకొని పరిష్కారం చేయాలని సూచించారు. అదేవిధంగా మండల నాయకులు ప్రజల సమస్యలను ఎందుకు పట్టించుకోవడం లేదు.?ఈ ప్రజా దర్బార్ కార్యక్రమంలో ఇన్ని సమస్యలు రావడం ఏమిటని సూటిగా ప్రశ్నించారు.ఇకపై ప్రజా సమస్యలను మండల నాయకులు, సచివాలయం సిబ్బంది కలిసి పరిష్కరించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో జడ్పిటిసి సభ్యులు తుమ్మల లక్ష్మయ్య, ఎంపీడీవో నగేష్ కుమారి,ఎంపీపీ ఏకుల శేషమ్మ, మండల నాయకులు, కార్యకర్తలు, వివిధ శాఖ అధికారులు,తదితరులు పాల్గొన్నారు.

## టిడ్కో ఇళ్లకు పూర్వ వైభవం తీసుకొని వస్తాం

**- మాజీ మున్సిపల్ చైర్ పర్సన్ తాళ్లపాక అనురాధ**
**- గత ప్రభుత్వంపై తీవ్రస్థాయిలో మండిపడ్డ అనురాధ**
**- ప్రజల కోసం నిరంతరం ఒక శ్రామికుడిగా పని చేసే వ్యక్తి నారాయణ**
**- మంత్రిగా, ప్రజల ఎమ్మెల్యేగా నారాయణ ఉండటం జిల్లా ప్రజల అదృష్టం**



**నెల్లూరు, నవంబర్ 26, ప్రభాతవార్త –వైద్యం** వైసీపీ టిడ్కో ఇళ్ళను నాశనం చేసిందని, పట్టించుకున్న పాపాన పోలేదని మాజీ మున్సిపల్ చైర్ పర్సన్ తాళ్ళపాక అనురాధ మండిపడ్డారు. ప్రజలు గుణపాఠం చెప్పినా కొందరు వైసీపీ నేతలకు ఇంకా బుద్ధి రాలేదని ఆమె విమర్శించారు. రాష్ట్ర పురపాలక పట్టణాభివృద్ధి శాఖ మంత్రి డాక్టర్ పొంగూరు నారాయణ ఆదేశాల మేరకు 54వ డివిజన్లో ఆమె పర్యటించారు. గత టీడీపీ హయాంలో టిడ్కో ఇళ్లను ఎంతో ప్రతిష్మాత్మకంగా చేపట్టామని, ప్రతి పేదవాడికి సొంతింటి కల నెరవేర్చమని అనురాధ తెలిపారు. అయితే వైసీపీ వచ్చిన వెంటనే టీడీపీ ప్రభుత్వానికి మంచి పేరు వస్తుందని టిడ్కో ఇళ్లను పట్టించుకున్న పాపాన పోలేదని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. టిడ్కో ఇళ్ల వద్దకు వెళ్లినప్పుడు ప్రజలు అనేక బాధలు చెప్పారని అన్నారు. దానికి తోడు విద్యార్థులు స్థానిక ప్రజలు అభ్యర్ధన మేరకు పార్కు ఏర్పాటు చేశామని, దాన్ని కూడా పట్టించుకోలేదని ఆమె గత ప్రభుత్వంపై మండిపడ్డారు. టిడ్కో ఇళ్ల స్థితిగతులను రాష్ట్ర మంత్రి పొంగూరు నారాయణ దృష్టికి తీసుకెళ్లి పూర్వ వైభవం తీసుకుని వచ్చే విధంగా చేస్తామని అనురాధ తెలిపారు. మంత్రి నారాయణ జిల్లా ప్రజలకు చేస్తున్న అభివృద్ధిని చూసి వైసీపీ ప్రభుత్వం ఓర్వలేకపోతుందన్నారు. మంత్రి మీద విమర్శలు చేస్తూ చూస్తూ ఊరుకోమని హెచ్చరించారు. నెల్లూరును స్మార్ట్ సిటీ దిఘా తీర్చిదిద్దేందుకు మంత్రి నారాయణ అడుగులు వేస్తున్నాని ఆమె అన్నారు. జిల్లా అభివృద్ధి కోసం పని చేస్తున్న మంత్రికి ప్రజల తరుపున కృతజ్ఞతలు తెలుపుతున్నామని ఈ సందర్భంగా ఆమె తెలిపారు.

## పేదల సొంతింటి కల సాకారం కావాలి

**- అధికారులు ఆ దిశగా ప్రత్యేక శ్రద్ధతో పని చేయాలి**
**- నాణ్యతతో కూడిన ఇళ్ల నిర్మాణం జరగాలి**
**- నెల్లూరులోని వేదాయపాలెం క్యాంపు కార్యాలయంలో సర్వేపల్లి నియోజకవర్గ హౌసింగ్ అధికారులతో సమీక్ష నిర్వహించిన శాసనసభ్యులు సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి**



**నెల్లూరు, నవంబర్ 26, ప్రభాతవార్త – వైద్యం** 2019కి ముందు టీడీపీ ప్రభుత్వ హయాంలో ఇళ్ల నిర్మాణం ప్రారంభించి బిల్లులు పొందలేకపో యిన వారి అందరి వివరాలు సేకరించాలని సూచన. వైసీపీ ప్రభుత్వ కక్ష సాధింపులతో నష్టపోయిన అందరి వివరాలను సీఎం దృష్టికి తీసుకెళ్లి న్యాయం చేస్తామని హామీ. ప్రతి గ్రామంలో ఇల్లులేని పేదలందరిని గుర్తించి నవంబర్ 30 లోపు ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని ఆదేశం. పేదల సొంతింటి కలలు సాకారం చేయడమే లక్ష్యంగా హౌసింగ్ శాఖ పని చేయాలి. ఇళ్ల నిర్మాణంలో నాణ్యత లోపిస్తే ఉపేక్షించే ప్రసక్తే లేదు.

## జక్కేపల్లి గూడూరులో 'రైతన్నా - మీకోసం' కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే



**బిట్రగుంట, నవంబర్ 26, ప్రభాతవార్త** బోగోలు మండలం జక్కేపల్లి గూడూరులో బుధవారం జరిగిన **'రైతన్నా – మీకోసం'** కార్యక్రమంలో కావలి నియోజకవర్గ ఎమ్మెల్యే డివి. కృష్ణారెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రతి రైతును వ్యక్తిగతంగా కలుసుకుని వారి సమస్యలు, అవసరాలు, అభిప్రాయాలను అడిగి తెలుసు కు న్నారు. గ్రామంలో ముఖ్యమంత్రి సందేశ పత్రాలను రైతులకు అందజేశారు. రైతులతో నేరుగా మాట్లాడిన సందర్భంగా, కూటమి ప్రభుత్వం వ్యవసాయ రంగాన్ని బలోపేతం చేయడానికి చేపడుతున్న పథకాలు, సబ్సిడీలు, సహాయ కార్యక్రమాలపై రైతులకు వివరంగా తెలియజేశారు.రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆశీస్సులతో రైతులు ఈసారి ఎంతో సంతృప్తిగా, ఆనందంగా ఉన్నారు. సోమశిల ప్రాజెక్ట్ నుంచి నీరు పుష్కలంగా అందడం రైతులకు గొప్ప అదృష్టం" అని ఎమ్మెల్యే అన్నారు."రైతులకు అన్ని విధాలుగా అండగా ఉంటాం. కావలి నియోజక వర్గంలో యూరియాకి ఎలాంటి ఇబ్బందులు లేకుండా ప్రభుత్వం పూర్తిగా పర్యవేక్షణ చేస్తోంది. రైతుల అభివృద్ధే మా లక్ష్యం" అని స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో వ్యవసాయ శాఖ అధికారులు, మండల టీడీపీ అధ్యక్షులు ఎం. నాగేశ్వరావు, నాగులవరం సొసైటీ అధ్యక్షులు చిలకపాటి వెంకటేశ్వర్లు, ఎంపీడీఓ సుబ్రహ్మణ్యం, ఎంఎఓ శైలజ, టిడిపి పార్టీ నాయకులు, స్థానిక కార్యకర్తలు, గ్రామస్థులు, రైతులు పాల్గొన్నారు.

## ఠాగూర్ ఇంగ్లీష్‌మీడియం స్కూల్లో రాజ్యాంగ దినోత్సవ వేడుకలు



**అనుమసముద్రంపేట ,నవంబరు 26 ప్రభాత వార్త:**మండల కేంద్రమైన ఏఎస్‌పేటలోని ఠాగూర్ ఇంగ్లీష్ మీడియం స్కూల్లో బుధవారం రాజ్యాంగ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం పాఠశాల విద్యార్థులకు 8,9,10 తరగతుల విద్యార్థులకు రాజ్యాంగ దినోత్సవంపై క్విజ్ పోటీలు నిర్వహించారు. ఈపోటీల్లో గెలుపొందిన వారికి బహుమతులు ప్రధానం చేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ సి.హెచ్.వి.రమణారెడ్డి, డైరెక్టర్ కె.దొరస్వామిరెడ్డి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## మోటార్ వెహికల్ ఇన్స్‌పెక్టర్ కార్యాలయంలో రాజ్యాంగ దినోత్సవ వేడుకలు



**ఆత్మకూరు,నవంబరు 26 ప్రభాతవార్త :** ఆత్మకూరులోని మోటార్‌వెహికల్ ఇన్స్‌పెక్టర్ కార్యాలయంలో ఇన్స్‌పెక్టర్ రాములు ఆధ్వర్యంలోబుధవారం రాజ్యాంగ దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా రాములు డాక్టర్ బిఆర్ అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈకార్యక్రమంలో విద్యా ర్థులు, వెహికల్ యజమానులు పాల్గొన్నారు.

## కోవూరు సత్రం వీధిలో గుర్తుతెలియని మృతదేహం కలకలం



**కోవూరు నవంబర్ 26 ప్రభాతవార్త :** కోవూరు మండల పరిధిలోని సత్రం వీధిలో శనివారం ఉదయం గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం కనిపించడం స్థానికుల్లో ఒక్కసారిగా కలకలం రేపింది. మృతదేహాన్ని చూసిన స్థానికులు వెంటనే పోలీసులకు సమాచారాన్ని అందించారు.సూచన అందుకున్న పోలీసులు అక్కడికి చేరు కొని పంచనామా నిమిత్తం మృతదేహాన్ని స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి తరలిం చారు.ప్రాథమికంగా మృతుని వివరాలు తెలియరాలేదని, కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించినట్లు పోలీసులు తెలిపారు. మృతుని గుర్తింపుకు సహకరి ంచవలసిందిగా ప్రజలను పోలీసులు కోరుతున్నారు.

## మనుబోలులో మూడు నెలలకే విద్యాశాఖ అధికారుల బదలీలు



**మనుబోలు నవంబర్ 26 ప్రభాతవార్త :** మనుబోలు మండల ఇంచార్జి విద్యాశాఖాధికారిగా నరేష్‌కుమార్ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పనిచేస్తున్న జె ఓబులు ఆరోగ్యం బాగా లేకపోవడంతో ఇంచార్జి బాధ్యతల నుండి తప్పుకున్నారు.ఆయన తిరిగి ఇందుకూరు మండలం ఇందుకూరుపేట మం డలం మైపాడు ఆశ్రమ పాఠశాలకు ప్రధానో పాధ్యాయులుగా వెళ్లారు. దీనితో ఉదయగిరి ప్రభుత్వ హై స్కూల్‌లో ప్రధానో పాధ్యాయులుగా పనిచేస్తున్న నరేష్‌కుమార్ బాధ్యతలు స్వీకరించారు. మనుబోలు మండల విద్యాశా ఖాధికారులు రెండేళ్ళలలో మూడు నెలలకు ఒకసారి మారడం పరిపాటి అయన మండల కేంద్రంలోని సిఎంనగర్ ప్రాథమిక పాఠశాలలో తనిఖీ చేశారు.ఈకార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు రాణి,సిఎం అర్జీలు,స్వరూప, జయరా మయ్య,చెంచురామయ్య ఉన్నారు.

## విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు చోరీ



**ఇందుకూరుపేట, నవంబర్ 26, ప్రభాతవార్త :** ఇందుకూరుపేట మండలంలోని ముదివర్తి పాలెం గ్రామంలో రన్నింగ్‌లో ఉన్న ట్రాన్స్‌ఫార్మర్లను గుర్తు తెలియని దుండగులు ఏబీ స్విచ్ ఆపుకొని ట్రాన్స్‌ఫార్మర్ లోపల ఉన్న ఆయిల్, రాగి వైరును మంగళవారం రాత్రి అపహరించారు. ఏబీ స్విచ్ లేని ట్రాన్స్‌ఫార్మర్‌ను కూడా చాకచక్యంగా ఒడదీసి దానిలో ఉన్న ఆయిల్‌ను రాగి వైరును ఇలా చాకచక్యంగా చేశారంటే ట్రాన్స్‌ఫార్మర్ గురించి పూర్తిగా తెలిసిన వ్యక్తులే చేయగలరని విద్యుత్ శాఖ అధికారులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం రైతులు నార్లు పోసుకునే సమయంలో ఇలా జరగడం రైతులు చాలా ఇబ్బందులు పడతారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పోలీసు రాత్రి సమయంలో గస్తీలేకపోవడం వల్లే తరుపు ఇలాంటి దొంగతనాలు జరుగుతున్నాయని రైతులు తెలిపారు. రాత్రి సమయాలలో గుర్తు తెలియని వ్యక్తులు మాస్కులు ధరించి ద్విచక్ర వాహనాలలో ఒంటరిగా వస్తున్న వారిని బెదిరిస్తున్నారని మండల ప్రజలు చెబుతున్నారు. ఇకనైనా పోలీసు శాఖ వారు రాత్రి సమయాలలో గస్తీ నిర్వహించి ఇలా తరచూ ఇలాంటి దొంగతనాలు జరగకుండా చూడాలని కోరుతున్నారు.

## ఏపీ ఎన్జీవోస్ అసోసియేషన్ ఎన్నిక



**ఇందుకూరుపేట, నవంబర్ 26, ప్రభాతవార్త :** ఇందుకూరుపేట తాలూకా మహిళా విభాగం చైర్ పర్సన్‌గా వి.రాజ్యలక్ష్మీ, కో చైర్ పర్సన్‌గా ఆర్. సురేఖ, వైస్ చైర్ పర్సన్‌గా పి.కమల, యు. మణెమ్మ, జి.నీలిమ, కన్వీనర్‌గా ఎం.ఉమామ హేశ్వరి, కో కన్వీనర్‌గా కే.శ్రీకల్పవల్లి, జాయింట్ కన్వీనర్‌గా ఎం.పోలమ్మ, ఎం.మాధవి, కే.పెంచలమ్మ, ట్రెజరర్‌గా కే.స్వాతి, ఎగ్జిక్యూటివ్ మెంబర్‌గా ఎస్.సుప్రజలను ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగింది. ఈ ప్రక్రియ ఇందుకూరుపేట తాలూకా అధ్యక్షులు పి.రామిరెడ్డి అధ్యక్షతన, జిల్లా వైస్ ప్రెసిడెంట్ ఈ.కరుణమ్మ పరిశీలకులుగా, మహిళా విభాగం రాష్ట్ర వైస్ చైర్‌పర్సన్ కే.స్వర్ణలత, జిల్లా చైర్ పర్సన్, చిన్నమ్మ, కన్వీనర్ ఎల్.నవోదయ ఆధ్వర్యంలో జరిగింది. ఈ కార్యక్రమంలో ఏపీఎన్జీవోస్ ఇందుకూరుపేట తాలూకా కార్యవర్గ సభ్యులు, తాలూకాలోని అన్ని శాఖల మహిళా ఉద్యోగినులు పాల్గొన్నారు.

## కనకపు సింహాసనం లాంటి మేయర్ స్థానంలో కూర్చోబెట్టింది కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి



**నెల్లూరు రూరల్, నవంబర్ 26, ప్రభాతవార్త :** రోడ్ల మీద తిరిగే మిమ్మల్ని కనకపు సింహాసనం లాంటి మేయర్ స్థానంలో కూర్చోబెట్టింది కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి అని, జయ వర్ధన్ తల్లిపాలు తాగి రొమ్ము గుద్దే వ్యక్తి అని తెలుగుదేశం పార్టీ క్లస్టర్ ఇన్‌చార్జి నూకరాజు మదన్ కుమార్‌రెడ్డి అన్నారు. బుధవారం ఆయన విలేకర్ల సమావేశం నిర్వహించారు. ఎక్కడో పొదలకూరుకు చెందిన జయవర్ధన్‌ను నన్ను ఒక బిడ్డల్లాగా రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి భావించారు, మమ్మల్ని రాజకీయంగా ఎంతో అభివృద్ధి చేశారు, గత కార్పొరేషన్ ఎన్నికల్లో ఇద్దరికి టిక్కెట్లు ఇచ్చి గెలిపించారని అన్నారు. ఒక్క రూపాయి కూడా ఖర్చు కానీవ్వకుండా ఎంతో మందిని బతిమిలాడుకొని ఏకగ్రీవంగా పొట్లూరి స్రవంతిని గెలిపించి అత్యున్నత మేయర్ పదవిని రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి అప్పగించారన్నారు. మేయర్ వంటి అత్యున్నత పదవిని అప్పగిస్తే తల్లిపాలు తాగి రొమ్మునే గుద్దిన చరిత్ర మేయర్ దంపతులది అని అన్నారు. కార్పొరేషన్ లో పెద్ద ఎత్తున అవినీతికి పాల్పడ్డారు అన్నారు. కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి లేకుంటే మేయర్, ఆయన భర్త రోడ్ల మీద తిరిగే వాళ్ల అని అన్నారు. కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి పెట్టిన రాజకీయ బిక్షతో గత నాలుగు సంవత్సరాలుగా మేయర్ పదవిని అనుభవిస్తున్నారన్నారు. అవిశ్వాసం తీర్మానం పెట్టగానే జయ వర్ధన్ మేయర్ గావ్ కేకలు పెడుతున్నారని అన్నారు. తిరిగి వైసీపీలో చేరేందుకు మేయర్, ఆమె భర్త మా ఎమ్మెల్యేపై విమర్శలు చేస్తున్నారన్నారు. రాజకీయ మనుగడ, సింపతి కోసం జయవర్ధన్ ఆరోపణలు చేస్తున్నారని అన్నారు. కోటంరెడ్డి దయవల్లే స్రవంతి మేయర్ అయ్యారు.. జయవర్ధన్‌కు హోదా వచ్చిందన్నారు. టీడీపీలోకి వస్తామని బతిమాలితే చేరుకోకపోవడం వల్ల విమర్శలు చేస్తున్నారన్నారు. కన్నతల్లిని కూడా పచ్చి బూతులు మాట్లాడిన చరిత్ర జయవర్ధన్‌ది అని అన్నారు.

## ప్రతాప్ రెడ్డి త్వరగా కోలుకోవాలని దర్గాలో పూజలు



**అల్లూరు,నవంబర్ 26,ప్రభాతవార్త:**మాజీ ఎమ్మెల్యే కావలి నియోజకవర్గం వైఎస్ఆర్సిపి ఇంచార్జ్ రామిరెడ్డి ప్రతాప్ కుమార్ రెడ్డి బైపాస్ సర్జరీ నుండి త్వరగ కోలుకోవాలని అల్లూరు కోనేటిమిట్ట వైస్సార్సీపీ నాయకుడు షేక్ జంషీర్, షేక్ బాబు ఆధ్వర్యంలో స్థానిక కోనేటిమిట్ట దర్గా వద్ద ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించడం జరిగింది. తమ ప్రియతమ నాయకుడు రామిరెడ్డి త్వరగ కోలుకొని తిరిగ ప్రజా సేవలో కి రావాలని ఆకాంక్షిస్తూ ప్రత్యేక పూజ కార్యక్రమాలను నిర్వహించి, 200 మందిక అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో వైస్సార్సీపి నాయకులు నీలం సాయికుమార్, ఉస్మాన్ షరీఫ్ సుధాకర్, మాధవ్,రసూల్, మసూద్, షన్న, ప్రమోద్,కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

## పాలకులు మంచివారు అయితే రాజ్యాంగం మంచిగా అమలౌతుంది



**కలువాయి నవంబర్ 26 ప్రభాతవార్త :** రాజ్యాంగం ఎంత గొప్పదైనప్పటికి దానిని అమలు చేసే పాలకులు మంచి వారు అయితే రాజ్యాంగం మంచిగా అమలు అవుతుందని ఎడిపిఎస్ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు నిజమాల ప్రసాద్ తెలిపారు. రాజ్యా ంగ దినోత్సవాన్ని పురస్కరించుకొని బుధవారం కలువాయిలోని డాక్టర్ బిఆర్ అంబేద్కర్ విగ్రహం వద్ద అంబేద్కర్‌కి నివాళుల ర్పించారు. దేశంలోని ప్రతి పౌరుడికి సమాన అవకాశాలు, సమాన హక్కులు కలిగి ఉండాలని ప్రతి పౌరుడికి న్యాయం అందే టట్లు రాజ్యాంగంలో పొందు పరచారని ఈ సందర్భంగా వక్తలు మాట్లాడారు.కలువాయి ఎస్ఐ కోటయ్య, పిహెచ్‌సి వైద్యాధికారి విజయలక్ష్మీ, మండల నాయకులు రేవూరు శ్రీనివాసులు,బోయిండ్ల బాబు, ఎన్ ప్రసాద్,దండు వెంకటరమణ, తదితరులు పాల్గొన్నారు.

## కండలేరు మట్టి కట్టను పటిష్ట పరచాలి : మిడతల రమేష్



**నెల్లూరు అగ్రికల్చర్, నవంబర్ 26, ప్రభాతవార్త –వైద్యం :** కండలేరు జలాశయం మట్టి కట్టను 350 కోట్లతో పటిష్ట పరచాలని బీజేపీ నమామి గంగే రాష్ట్ర కన్వీనర్ మిడతల రమేష్ అన్నారు. బుధవారం ఆయన సోమశిల జలాశయాన్ని, కండలేరు జలాశ యాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నెల్లూరు జిల్లాకు సాగునీటి వనరులైన సోమశిల జలాశయం, కండలేరు జలాశయం జిల్లా అధికారుల పర్యవేక్షణలో మాత్రమే కొనసాగాలని తెలిపారు. ఈ రెండు నదుల యొక్క సాగునీటి కాలువలను కూడాయుద్ధ ప్రాతిపదికన పటిష్ట పరచాలన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నేతలు నరాల సుబ్బారెడ్డి, నీలిశెట్టి లక్ష్మణరావు, చింతగింజల సుబ్రహ్మణ్యం, పూల ప్రశాంత్, అమర సురేష్ తదితరులు పాల్గొన్నారు.

## టీబీ నివారణ లక్ష్య సాధనకు కృషి చేయండి



**నెల్లూరు, నవంబర్ 26, ప్రభాతవార్త –వైద్యం :** టీబీ నివారణకు సమాజంలోని ప్రతి ఒక్కరూ సహకారం అందించాలని నెల్లూరు జిల్లా లెప్రసీ ఎయిడ్స్, టీబీ నివారణ అధికారి డాక్టర్ ఎస్‌కే ఖాదర్ వల్లి అన్నారు. బుధవారం నెల్లూరులోని ఏసీఎస్ఆర్ మెడికల్ కళాశాలలో ఆయన కోర్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ రాజేశ్వరి, పలమనాలజీ వైద్యులు హెచ్ఓడీ డాక్టర్ అరుణ, అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ రేవతి తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రధానమంత్రి టీబీ ముక్తభారత్ అభియాన్ కార్యక్రమంపై చర్చించారు. ఈ సందర్భంగా డాక్టర్ ఎస్‌కే ఖాదర్ వలీ మాట్లాడుతూ టీబీ నివారణకు వైద్య ఆరోగ్య సిబ్బంది మెరుగైన సేవలు అందించాలని కోరారు. వివిధ శాఖల సమన్వయంతో రాబోయే మూడు నెలల్లో టీబీ నివారణ లక్ష్య సాధనకు కృషి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వివిధ విభాగాల హెచ్ఓడీలు, టీబీ నివారణ సిబ్బంది పాల్గొన్నారు.

## రాజ్యాంగం అందరికి స్ఫూర్తి దాయకం



**మనుబోలు నవంబర్ 26 ప్రభాతవార్త :** 76 వ రాజ్యాంగ దినోత్సవాన్ని పురస్కరించుకొని బుధవారం నాడు స్థానిక తహసిల్దారు ,ఎంపిడిఒ కార్యాలయంలో అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ప్రతిజ్ఞ చేశారు. ఒకే దేశం ఒకే రాజ్యాంగం ఒకే స్ఫూర్తి ఉండాలన్నారు. అంబేద్కర్ పేద బడుగు బలహీన వర్గాల కోసం ఎంతో కృషి చేసి భారత రాజ్యాంగాన్ని రూపొందించిన ప్రేరణను గుర్తు చేశారు. ఈకార్యక్రమంలో డిప్యూటి తహసిల్దారు ప్రదీప్, ఎంపిడిఒ జలజాక్షి, నాగార్జునరెడ్డి, వరుణ్ తేజ, డిప్యూటి ఎంపిడిఒ శ్రీనివాసరావు, సీనియర్ అసిస్టెంట్ నిరంజన్‌కుమార్, జూనియర్ పంచాయితీ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

## భారత దేశంలోని పరిపాలనలో రాజ్యాంగంను అమలు చేసిన దినోత్సవం



**నెల్లూరు సిటీ, నవంబర్ 26, ప్రభాతవార్త :** నెల్లూరు జిల్లా మెప్మా ప్రాజెక్ట్ డైరెక్టర్ కార్యాలయంలో మన దేశ మేధావులు నాయకులు డా. బీమ్ రావు అంబేద్కర్‌కి , గాంధీజీకి ఘనంగా నివాళులు అర్పిస్తూ వారిని స్మరించుకున్నారు. ఈ సందర్భంగా ఐబి అంకయ్య మాట్లాడుతూ రాజ్యాంగం రచించడంలో అంబేద్కర్‌ది కీలక పాత్ర భారత దేశ పరిపాలన సౌలభ్యం కొరకు ఇది బాగా ఉపయోగపడింది అని అన్నారు. టీఈ మార్కెటింగ్ కాంతయ్య మాట్లాడుతూ మనది లౌకిక ప్రజా స్వామ్య గణ తంత్ర దేశం ప్రపంచం లోనే అతి పెద్ద ప్రజాస్వామ్య దేశం అనేక కులాలు, జాతులు మతాలు, భాషలు, ప్రాంతాలు కలగలిపిన ఈ దేశం ఇప్పటికీ అందరు కలిసి ఉన్నారు. దానికి కారణం మన రాజ్యాంగం అని అన్నారు. ఈ కార్యక్రమంలో సీనియర్ అసిస్టెంట్ చంద్రశేఖర్, టిఈ సుధాకర్, జూనియర్ అసిస్టెంట్ రుక్సానా, డిఈఓ షాకీర్, టి ఎం సి సౌజన్య, రాజశేఖర్,ఆదినారాయణ, సునంద పాల్గొన్నారు.

## ఎస్పీను సన్మానిస్తున్న టిడిపి నేతలు ఎస్పీను సత్కరించిన జల జీవన్ మిషన్ డైరెక్టర్



**కోవూరు నవంబర్ 26 ప్రభాతవార్త** కోవూరు ఎస్ఐగా ఇటీవల బాధ్యతలు స్వీకరించిన ముత్యాలరావును బుధవారం గ్రామానికి చెందిన జలజీవన్ మిషన్ డైరెక్టర్ పార్టీ సీనియర్ నాయకులు విన్న కోటరాధాకృష్ణ ఆధ్వర్యంలో టిడిపి నాయకులు శాలువా పుష్పగుచ్చం స్వీట్లతో ప్రత్యేకంగా. ఎస్పైను అభినందించారు. ఈ కార్యక్రమంలో పడుగుపాడు గ్రామానికి చెందిన టిడిపి నాయకులు పాల్గొన్నారు.

## స్త్రీ, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఘనంగా కాన్స్‌టిట్యూషన్ డే, యాంటీడౌరీ డే వేడుకలు




**నెల్లూరు సిటీ, నవంబర్ 26, ప్రభాతవార్త** : స్త్రీ, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఘనంగా కాన్స్‌టిట్యూషన్ డే, యాంటీడౌరీ డే వేడుకలు పురస్కరించుకుని మహిళా ప్రాంగణంలో మహిళలకు అవగాహన కల్పించారు. తొలుత జ్యోతి ప్రజ్వలనతో ప్రారంభమైంది. అనంతరం నెల్లూరు జిల్లా స్త్రీ, శిశు సంక్షేమ శాఖ అధికారిణి హేనసుజాన్ ఆధ్వర్యంలో పైన పేర్కొన్న కార్యక్రమాలు నిర్వహించబడ్డాయి. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి మరియు సీనియర్ సివిల్ జడ్జి కె. వాణి హాజరై కాన్స్టిట్యూషన్ ప్రాముఖ్యత, యాంటీడౌరీ చట్టాలు గురించి అవగాహన ప్రసంగం అందించారు. తరువాత డా. బి.ఆర్. అంబేద్కర్ చిత్రపటానికి మాల వేసి నివాళులర్పించారు. అనంతరం హాజరైన అందరికీ కాన్స్టిట్యూషనల్ పీఠిక చదివారు. ఈ కార్యక్రమంలో మహిళా ప్రాంగాణం నోడల్ ఆఫీసర్ అనురాధ, మేనేజర్ కె. మాధవి, నెల్లూరు అర్బన్ సిడిపిఓ సఖి వన్ స్టాప్ సెంటర్ అడ్మిన్ టి. అరుణచ ఎస్‌కె. షహనాజ్‌తో పాటు సిబ్బంది లీగల్ కౌన్సిలర్ ఎన్. ప్రశాంతి సోషల్ కౌన్సిలర్ టి. కమలా, కేసు వర్కర్ జి.సాధన, పిశారదా, ఐటీ డి .ప్రగతి, ఐసిడిఎస్ సూపర్‌వేజర్లు, అంగన్వాడి కార్యకర్తలు ఉత్సాహంగా పాల్గొన్నారు.

## ఆరోగ్య శిబిర దృశ్యం వైద్యుల సలహాలు సూచనలు తప్పక పాటించాలి



**కోవూరు నవంబర్ 26 ప్రభాతవార్త** కోవూరుమండలం పోతిరెడ్డి పాలెం గ్రామంలో బుధవారం వై కే ఆర్ అండ్ కె ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఆధ్వర్యంలో చేపడుతున్న సామాజిక సేవా పథకం కార్యక్రమాలు బుధవారం సైతం కొనసాగాయి ఇనమడుగు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో వైద్య శిబిరం నిర్వగి ంచారు ఈ సందర్భంగా వైద్యులు డాక్టర్ నిరంజన్ మాట్లాడుతూ గ్రామాల్లో నివసిస్తున్న ప్రతి ఒక్కరూ వైద్యుల సలహాలు సూచనలను తప్పక పాటిం చాలన్నారు కానీ డాక్టర్ రామాంజనేయులు మాట్లాడుతూ ఇటువంటి శిబిరాలు ఏర్పాటు చేయడం ద్వారా విద్యా ర్థుల్లో సామాజిక సేవ చేయాలనే తపన పెరుగుతుందన్నారు ఈ సందర్భంగా వైద్యులు పరీక్షల నిర్వహించి మందులు పంపిణీ చేశారు ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ లక్ష్మీ ్మప్రసన్న వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ రాంప్రసాద్ అధ్యాపకులు మసూదన్ రావు ఎం జాన్ పాల్ తదితరులు ఉన్నారు .

## స్వచ్ఛ గ్రామాలకు మహిళలు చొరవ చూపాలి



**కోవూరు నవంబర్ 26 ప్రభాతవార్త :** మహిళలు పూర్తిస్థాయిలో చొరవ చూపితే స్వచ్ఛ గ్రామాలు తయారు అవుతాయని ఎంపీడీవో శ్రీహరి రెడ్డి అన్నారు స్థానిక మండల పరిషత్ మందిరంలో బుధవారం పొదుపు మహిళలకు థీమ్ 5 గ్రీన్ విలేజ్ పై ఒక్కరోజు శిక్షణ అవగాహన సదస్సు నిర్వహించారు ఈ సందర్భంగా ఆయన మాటాడుతూ పరిసరాల పరిశుభ్రత పై మహిళలు పూర్తిస్థాయిలో అవగాహన చేసుకుని ముందుకు సాగితే మంచి ఫలితాలు వస్తాయి అన్నారు ప్రతి మహిళ తమ ఇంటితోపాటు పరిసరాలు కూడా పరిశుభ్రంగా ఉంచుకుంటే ప్రతి ఒక్కరూ ఆరోగ్యంగా ఉంటారన్నారు ప్రభుత్వం మంచి సదుద్దేశంతోనే ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టిందని ఇందుకు మహిళలు ప్రత్యేకంగా చొరవ చూపాలన్నారు పరిసరాలు పరిశుభ్రంగా ఉంటేనే ఎటువంటి అనారోగ్యాలు చేరే అవకాశం కూడా ఉండదన్నారు డిప్యూటీ ఎంపీడీవో శ్రీనివాసులు మహిళలకు పలు సూచనలు చేశారు. అంతకుముందు అంబేద్కర్ మహాత్మా గాంధీ చిత్రపటాలకు పూలమాల వేసి ఘన నివాళులు అర్పించారు ఈ కార్యక్రమంలో కార్యాలయ పర్యవేక్షకులు ఉషారాణి సీనియర్ అసిస్టెంట్ సురేష్ జూనియర్ అసిస్టెంట్ రాధా ఆఫీస్ సబార్డేట్లు పొదుపు మహిళలు ఉన్నారు

## నూతన ఇల్లు మంజూరుకు దరఖాస్తు చేసుకోండి



**ఉదయగిరి, నవంబర్ 26, ప్రభాతవార్త :** ఉదయగిరి మండలంలోని ఇల్లులేని నిరుపేదలకు రాష్ట్ర ముఖ్యమంత్రి వర్యులు నారా చంద్రబాబునాయుడు ఆధ్వర్యంలో నియోజకవర్గ ఎమ్మెల్యే కాకర్ల సురేష్ సారథ్యంలో నూతన ఇల్లు మంజూరుకు ప్రభుత్వం దరఖాస్తు కు అవకాశం కల్పించిందని తెలుగుదేశం పార్టీ యువ నాయకులు సయ్యద్ సందాని అన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆధ్వర్యంలో ఇల్లు లేని నిరుపేదలకు ఇంటి నిర్మాణం కోసం ప్రభుత్వం రెండు లక్షల 50 వేల రూపాయలు మంజూరు చేస్తుందని తెలిపారు. మండలంలోని అన్ని గ్రామాలలో ఇల్లులేని పేద బడుగు బలహీన వర్గాల ప్రజలు స్థానికంగా సచివాలయంలో ఉద్యోగస్తులు, ఇంజనీరింగ్ అసిస్టెంట్లు ద్వారా దరఖాస్తు చేసుకొనుటకు అవకాశం కల్పించిందని లబ్ధిదారులు అధికారులను, స్థానిక నాయకులను సంప్రదించి నవంబర్ 30వ తేదీ లోపు దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఇల్లులేని ప్రతి పేదవానికి ఇల్లు నిర్మించడమే లక్ష్యంగా ఎమ్మెల్యే కాకర్ల సురేష్ కృషి చేస్తున్నారని అన్నారు. ఆయన సారథ్యంలో నూతన ఇల్లు మంజూరు వచ్చినటువంటి అవకాశాన్ని మండలంలోని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు.

## శ్రీచైతన్య ఆధ్వర్యంలో రాజ్యాంగ దినోత్సవ ర్యాలీ



**వింజమూరు, నవంబర్ 26, ప్రభాతవార్త :** వింజమూరులోని శ్రీ చైతన్య పాఠశాల ఆధ్వర్యంలో రాజ్యాంగ దినోత్సవాన్ని పురష్క రించుకుని ర్యాలీ కార్యక్రమాన్ని నిర్వహించారు. స్థానిక పాఠశాల నుండి పాత బస్టాండ్ సెంటర్ నుండి బంగ్లా సెంటర్లోని అంబేద్కర్ విగ్రహం వరకు విద్యార్థులతో ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ప్రిన్సిపాల్ వేణుగోపాలకృష్ణ, డీన్ మస్తాన్‌లు మాట్లాడుతూ విద్యార్థులకు రాజ్యాంగం తయారీ ప్రాధాన్యతను గురించి వివరించారు. రాజ్యాంగ ఆవశ్యకత ఒక దేశానికి ఎలా అవసరమవుతుందో తెలియజేశారు. రాజ్యాంగం దేశానికి ఏ విధంగా సూచికగా ఉంటుందో తెలియజేశారు. రాజ్యాంగం లేని రాజ్యం చుక్కానిలేని నావలాంటిదని వారు తెలిపారు. కావున రాజ్యాంగాన్ని అందరం గౌరవించాల్సి న అవసరం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో దివ్య కృష్ణారెడ్డి, మనోజ్, షేక్ భాష, బోధన, బోధనేతర సిబ్బంది ఉన్నారు.

## ఏడీపీఎస్ ఆధ్వర్యంలో రాజ్యాంగ దినోత్సవం వేడుకలు



**వింజమూరు, నవంబర్ 26, ప్రభాతవార్త :** వింజమూరులో ఏడీపీఎస్(అంబేద్కర్ ధర్మ పోరాట సమితి) ఆధ్వర్యంలో బుధవారం రాజ్యాంగ దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. స్థానిక బంగ్లా సెంటర్లోని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఏడీపీఎస్ జిల్లా కార్యవర్గ సభ్యులు గుజ్జు చెన్నయ్య మాట్లాడుతూ 1946 లో రాజ్యాంగ పరిషత్ ముసాయిదా కమిటీని ఏర్పాటు చేసి రాజ్యాంగాన్ని కి రూపకల్పన చేశారని 1949లో నవంబర్ 26న ఆమోదించారని తెలిపారు. ఈ రాజ్యాంగం తయారు కావడానికి రెండు సంవత్సరాల 11 నెలల 18 రోజులు సమయం పట్టిందని దీనికంతటికి డాక్టర్ బీఆర్ అంబేద్కర్ యొక్క కృషి ప్రధానంగా ఉందన్నారు. అంబేద్కర్ రాసిన రాజ్యాంగం ప్రపంచ దేశాల రాజ్యాంగాలలోని మన దేశానికి అనుకూలమైన అంశాలను సేకరించి అతి పెద్ద రాజ్యాంగంగా రూపొందించారని అన్నారు. ఆర్థిక సాంఘిక ఆర్థిక రాజకీయ ఆలోచన సమాన అవకాశం కల్పించిందన్నారు. ఇది ప్రపంచంలోనే అత్యంత సమగ్రమైన, పెద్దదైన లిఖిత అలిఖిత రాజ్యాంగం అన్నారు. ఇలాంటి రాజ్యాంగం అందించిన మహోన్నత వ్యక్తి డాక్టర్ బీఆర్ అంబేద్కర్ అని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో పెద్దేటి చెన్నయ్య, బీఈడీ చెన్నయ్య, శ్రీరామ్ శ్రీనివాసులు, ఆరికొండ సురేష్, ఆరికొండ శ్రీనివాసులు, బాల కేశవులు, ఎన్.కృష్ణ, ఎన్.బాలకృష్ణ, ఎన్నుపల్లి నరేష్ తదితరులు ఉన్నారు.

## జూనియర్ కళాశాలలో రాజ్యాంగ వేడుకలు




**విడవలూరు, నవంబర్ 26 ప్రభాతవార్త:** విడవలూరు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో భారత రాజ్యాంగ దినోత్సవ వేడుక కార్యక్రమాన్ని కళాశాల ప్రిన్సిపాల్ బీడీ దిన దయాల్ ఆధ్వర్యంలో ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నవంబర్ 26 భారత రాజ్యాంగాన్ని ఆమోదించుకున్న రోజు అని ఈ వేడుక 2015నుండి ప్రతి సంవత్సరం రాజ్యాంగ దినోత్సవం గా జరుపుకోవాలని ప్రభుత్వం తీర్మానిస్తూ అధికారికంగా ప్రచురించడం జరిగిందన్నారు. రాజ్యాంగంలో పొందు పరిచిన అంశాల ఆధారంగా అందరూ స్వేచ్ఛాయుత వాతావరణంలో ప్రశాంతంగా జీవిస్తున్నా మన్నారు. అంతకముందు డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళుల ర్పించారు. అనంతరం విద్యార్థినీ,విద్యార్థులకు వ్యాసరచన పోటీలు, వక్తృత్వ నిర్వహించి గెలుపొందిన వారికి బహుమతులు అందజేయడం జరిగిందన్నారు. పౌరనీతి శాస్త్ర అధ్యాపకులు కట్ట సాంబశివరావు, ఎన్ఎస్ఎస్ విభాగం తదితరులు పాల్గొన్నారు.

## ప్రసన్న పరామర్శ



**కోవూరు నవంబర్ 26 ప్రభాతవార్త :** కోవూరు మం డలం పాటూరు గ్రామానికి చెందిన వైసీపీ సీనియర్ నాయకులు ఆదిప రెడ్డి సోదరి. కామేశ్వరమ్మ ఇటీవల మృతి చెందారు ఈ మేరకు బుధవారం వైసిపి పిఎసి సభ్యులు మాజీ మంత్రి ప్రసన్నకుమార్ రెడ్డి వారి స్వ గృహానికి వెళ్లి కుటుంబ సభ్యు లను పరామర్శించి తన సానుభూతి తెలియజేశారు ఈ సందర్భంగా ఆమె చిత్రపటానికి పూలమాలవేసి నివాళులు అర్పించారు ఈ కార్యక్రమంలో ఆయన వెంట వైసీపీ జిల్లా ఉపా ధ్యక్షులు రాధాకృష్ణారెడ్డి జిల్లా వైసీపీ రైతు సంఘం అధ్యక్షులు శివుని నరసింహులు రెడ్డి మండల పార్టీ అధ్యక్షులు అత్తిపల్లి అనుప్ రెడ్డి జడ్పిటిసి సభ్యురాలు కే శ్రీలత సర్పంచ్ వై లక్ష్మి ్మ కుమారి సతీష్ రెడ్డి మసూదన్ రెడ్డి తదితరులు ఉన్నారు జిల్లా ఎస్పీ అజిత్ వేజెండ్ల ఆదేశాల మేరకు రూరల్ డిఎస్పి జిల్లా ఎస్పీ అజిత్ వేజెండ్ల ఆదేశాల మేరకు రూరల్ డిఎస్పి.

## ద్విచక్ర వాహన చోదకులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలి



**కోవూరు నవంబర్ 26 ప్రభాతవార్త :** ద్విచక్ర వాహనాలు నడిపే ప్రతి ఒక్కరు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని ఎస్పై ముత్యాలరావు తెలిపారు జిల్లా ఎస్పీ అజిత్ వేజెండ్ల ఆదేశాల మేరకు రూరల్ డిఎస్పి ఘట్టమనేని శ్రీనివాస్ పర్యవేక్షణలో సీఐ వి సుధాకర్ రెడ్డి సూచనల మేరకు. జాతీయ రహదారిలో ఎస్పై ముత్యాలరావు హెల్మెట్ ధరించ కుండా ప్రయాణిస్తున్న వాహనదారులకు అవగాహన కల్పించే కార్యక్రమం బుధ వారంనిర్వహించారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ద్విచక్ర వాహన చోధకులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలన్నారు ఇటీవల కాలంలో జరిగిన రోడ్డు ప్రమాదాలలో అనేకమంది ద్విచక్ర వాహన చోధకులు హెల్మెట్ లేని కారణంగా మృత్యువాత పడ్డారని ఈ సందర్భంగా ఆయన వారికి తెలియజేశారు దీనిని దృష్టిలో పెట్టుకొని ప్రతి ఒక్కరూ విధిగా హెల్మెట్ ధరించాలని ఆయన పేర్కొన్నారు ఈ కార్యక్రమంలో హెడ్ కానిస్టేబుల్స్ పోలీసులు ఉన్నారు.

## ఇనుమడుగులో రైతన్న మీకోసం కార్యక్రమం



**కోవూరు నవంబర్ 26 ప్రభాతవార్త,** కోవూరు మం డలం ఇనుమడుగు గ్రామపంచాయతీ జమ్మిపాలెం గ్రామం లో కూడా బుధవారం రైతన్న మీకోసం కార్యక్రమం పై మండల ఇన్చార్జి వ్యవసాయ అధికారిని మేరీ కమల అవగాహన కల్పించే కార్యక్రమం చేపట్టారు ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎవరైనా రైతులు అర్హత కలిగి ఉండి అన్నదాత నిధులు ఖాతాలో జామ కాకపోతే వెంటనే తమ దృష్టికి గాని సంబంధిత రైతుసేవా కేంద్రంలో సంప్రదించాలన్నారు ఈ సందర్భంగా రైతన్న మీకోసం కరపత్రాలను ఆవిష్కరించి రైతులకు అందజేశారు ఈ కార్యక్రమంలో ఆ ప్రాంత రైతులు ఉన్నారు

## చిలకపాడులో ఘనంగా రాజ్యాంగ దినోత్సవం

**మర్రిపాడు, నవంబరు26 ప్రభాతవార్త:** మర్రిపాడు మండలంలోని చిలకపాడు ఉన్నతపాఠశాలలో బుధవారం రాజ్యాంగ దినోత్సవ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా ఉపాధ్యాయులు అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. రాజ్యాంగ ప్రవేశికను విద్యార్థులతో చదివించారు. ఈసందర్భంగా ప్రధానోపాధ్యాయులు డాక్టర్ మారుతికేశవ్‌కుమార్‌రెడ్డి రాజ్యాంగం విశిష్టతను విద్యార్థులకు వివరించారు. అనంతరం సాంఘికశాస్త్ర ఉపాధ్యాయులు ఎస్.బాబురావు, మాక్ అసెంబ్లీ కార్యక్రమాన్ని విద్యార్థులతో విజయవంతంగా నిర్వహించారు. విద్యార్థులకు క్విజ్, వక్తృత్వం పోటీలు నిర్వహించారు. గెలుపొందిన వారికి బహుమతులను అందజేశారు. ఈకార్యక్రమంలో భౌతికశాస్త్ర ఉపాధ్యాయుడు ఏడుకొండలు, గణితశాస్త్ర ఉపాధ్యాయుడు రమణ, ఆంగ్ల ఉపాధ్యాయుడు హరినాథ్, జీవశాస్త్ర ఉపాధ్యాయులు సురమౌళి, తెలుగు ఉపాధ్యాయులు దేవిడ్‌సన్, ఉపాధ్యాయులు శివరామిరెడ్డి, నర్సింహులు , విద్యార్థులు పాల్గొన్నారు.

## లేళ్లపల్లి ఇంట్లో ఎమ్మెల్యే సందడి



**బిట్రగుంట నవంబర్ 26 ప్రభాతవార్త :** బోగోలు మండలం విశ్వనాథరావుపేటకు చెందిన కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి లేళ్లపల్లి సురేష్ గృహప్రవేశం ఇటీవల జరిగింది. నాడు గృహప్రవేశ కార్యక్రమానికి హాజరుకాలేక పోయిన కావలి ఎమ్మెల్యే డివి కృష్ణారెడ్డి బుధవారం వారి నివాసానికి చేరుకొని వారికి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా కుటుంబసభ్యులతో సందడి చేశారు. ఎమ్మెల్యే వెంట సురేష్బాబు సోదరుడు కావలి ఏఎంసి డైరెక్టర్ ఎల్. సుధీర్ బాబు మండల టీడీపీ నేతలు పాల్గొన్నారు.

## సండే మార్కెట్లో సీసీ రోడ్డు, డ్రైనేజీ వ్యవస్థకు శాశ్వత పరిష్కారం

**– నగర డిప్యూటీ మేయర్ రూప్ కుమార్ యాదవ్**



**నెల్లూరు, నవంబర్ 26, ప్రభాతవార్త –వైద్యం :** మంత్రి పొంగూరు నారాయణ ఆదేశాల మేరకు నెల్లూరు నగరంలోని 45వ డివిజన్ సండే మార్కెట్ ప్రాంతంలో జరుగుతున్న సీసీ రోడ్డు, డ్రైనేజీ పనులను అధికారులతో కలిసి నగర డిప్యూటీ మేయర్ రూప్ కుమార్ యాదవ్ బుధవారం నాడు పరిశీలించారు. ఈ సందర్భంగా రూప్ కుమార్ యాదవ్ మాట్లాడుతూ నెల్లూరు నగర నియోజకవర్గ పరిధిలోని అనేక సంవత్సరాలుగా సుపరిచితంగా ఉన్నటువంటి సమస్యలు ఏవైతే ఉన్నాయో వాటినన్నింటి మీద దృష్టి సారించి మంత్రి నారాయణ చొరవతో యుద్ధ ప్రాతిపదికన పనులను చేస్తున్నారన్నారు. అందులో భాగంగానే నెల్లూరు నగర నడిబొడ్డున ఉన్నటువంటి సండే మార్కెట్ ప్రాంతంలో చిన్నపాటి వర్షం పడిన ఈ ప్రాంతమంతా జలమయమయ్యే పరిస్థితి ఉందన్నారు. స్థానిక తెలుగుదేశం పార్టీ నాయకులందరూ కలిసి ఇక్కడున్నటువంటి సమస్యను మంత్రి దృష్టికి తీసుకెళ్లడం జరిగిందన్నారు.స్వయంగా సండే మార్కెట్ ప్రాంతానికి మంత్రి వచ్చి పరిశీలన చేసి మరుసటి రోజే ఈ ప్రాంతంలో పనులను ప్రారంభించారంటే అర్థం చేసుకోవచ్చు మంత్రి నారాయణ ఏ విధంగా పని చేస్తున్నారో అని అన్నారు. ఏ పనైనా ముఖ్యమంత్రి స్థాయి వరకు తీసుకెళ్లి మాట్లాడి వెనువెంటనే పనులు చేయించగలిగే వ్యక్తి మంత్రి నారాయణ అని అన్నారు. అదే విధంగా పార్లమెంట్‌కు ప్రాతినిధ్యం వహిస్తున్నటువంటి వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి కూడా తన వంతు నెల్లూరు నగరానికి అన్ని రకాలుగా సహకారాలు అందిస్తున్నానన్నారు. వీరిద్దరి మంచి కలయికతో నెల్లూరు నగరం అభివృద్ధి పథంలోకి దూసుకుపోతుందన్నారు. ఈ కార్యక్రమంలో కో క్లస్టర్ డాక్టర్ పోకల రవి, 45వ డివిజన్ ప్రెసిడెంట్ సుజన్, తెలుగుదేశం పార్టీ పార్లమెంట్ అధికార ప్రతినిధి జెడ్ శ్రీనివాసులు, తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు దార్ల వెంకటేశ్వర్లు, క్లస్టర్ అజయ్, 45వ డివిజన్ జనరల్ సెక్రటరీ కృష్ణారావు, కో ఆర్డినేటర్ ఉదయ భాస్కర్, యూనిట్ ఇన్‌చార్జి లత, బూత్ కన్వీనర్ మాధవి తదితరులు పాల్గొన్నారు.

## రెడ్ క్రాస్ స్టాస్టిక్ సెంటర్లో స్వర్గీయ మాగుంట సుబ్బరామిరెడ్డి జయంతి వేడుకలు



**నెల్లూరు, నవంబర్ 26, ప్రభాతవార్త –వైద్యం** మాజీ పార్లమెంట్ సభ్యులు, స్వర్గీయ మాగుంట సుబ్బరామిరెడ్డి ఎన్నో కార్యక్రమాలు నిర్వహించి, అందరికి ఆదర్శంగా నిలిచారని, ఆయన సేవలు మరువరానివని నెల్లూరు రెడ్ క్రాస్ చైర్మన్ వాకాటి విజయ్ కుమార్‌రెడ్డి అన్నారు. బుధవారం నెల్లూరు రెడ్ క్రాస్ స్టాస్టిక్ సెంటర్లో మాజీ పార్లమెంటు సభ్యులు స్వర్గీయ మాగుంట సుబ్బరామిరెడ్డి జయంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా సుబ్బరామిరెడ్డి చిత్రపటానికి వాకాటి విజయ్ కుమార్‌రెడ్డి రెడ్ క్రాస్ సిబ్బంది పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా విజయ్ కుమార్‌రెడ్డి మాట్లాడుతూ నేటితరం నాయకులకు స్వర్గీయ మాగుంట సుబ్బరామిరెడ్డి ఆదర్శవంతమని చెప్పారు. అనంతరం స్పాస్టిక్ సెంటర్ కోఆర్డినేటర్ దాసరి రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ సుబ్బరామిరెడ్డి కుటుంబ సభ్యుల ఆప్యాయత ఆదరణ ఎల్లప్పుడూ ఇండియన్ రెడ్ క్రాస్ ప్లాస్టిక్ సెంటర్ చిన్నారుల మీద ఉండాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో రెడ్ క్రాస్ వైస్ చైర్మన్ చెమర్తి జనార్ధన్‌రాజు, ఎడవల్లి సురేష్, సెక్రటరీ పి.మస్తానయ్య, మాజీ రెడ్ క్రాస్ చైర్మన్ డాక్టర్ ఏవీ సుబ్రహ్మణ్యం, మాగుంట సుబ్బరామిరెడ్డి, కోడలు మమతమ్మ, అడ్వకేట్ బీద జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

## రెడ్ క్రాస్ క్యాన్సర్ వైద్యశాలలో అన్నదానం



**నెల్లూరు, నవంబర్ 26, ప్రభాతవార్త –వైద్యం :** క్యాన్సర్ వైద్యశాల నిర్మాణ దాత, రక్తదాత కి.శే చంద్రగిరి నారాయణ జన్మదిన వేడుకలు నెల్లూరులోని పొదలకూరు రోడ్డులో ఉన్న రెడ్ క్రాస్ క్యాన్సర్ వైద్యశాలలో బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా క్యాన్సర్ వైద్యశాలలో చికిత్స పొందుతున్న రోగులకు, వారి సహాయకులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని చంద్రగిరి నారాయణ తనయుడు అజయ్‌బాబు, రెడ్ క్రాస్ మాజీ కన్వీనర్ సారథ్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రెడ్ క్రాస్ రక్తనిధి మాజీ అడ్వకేట్ మలిరెడ్డి, కోటాఎడ్డి, క్యాన్సర్ వైద్యశాల సీఎంఓ డాక్టర్ టి.లక్ష్మి, రెడ్ క్రాస్ జీవిత కాల సభ్యులు సీహెచ్ వెంకటేశ్వరరావు, మురళీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## పంచాయతీ కార్యాలయంలో రాజ్యాంగ దినోత్సవ వేడుకలు



**వింజమూరు, నవంబర్ 26, ప్రభాతవార్త :** వింజమూరు పంచాయతీ కార్యాలయంలో బుధవారం రాజ్యాంగ దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. సర్పంచ్ ఎన్ సుజనా , ఎంపీడీవో కే.శ్రీనివాసరెడ్డి ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాజ్యాంగం రచనకు పూనుకొని అత్యంత ప్రయాసతో సుమారు రెండు సంవత్సరాల 11 నెలల 18 రోజులు కాలం పాటు కష్టపడి డాక్టర్ బీఆర్ అంబేద్కర్ మనకు అందించారన్నారు. ఈ రాజ్యాంగం 1946లో ముసాయిదా కమిటీగా ఏర్పడి రాజ్యాంగానికి సంబంధించిన విషయ పరిశీలన జరిగింది. 1949 నవంబర్ 26వ తేదీన రాజ్యాంగం ఆమోదించబడిందని తెలిపారు. ఈ రాజ్యాంగాన్ని తయారు చేయడానికి డాక్టర్ బీఆర్ అంబేద్కర్ ప్రపంచంలోని సుమారు 14 దేశాల రాజ్యాంగాలను పరిశీలించి అందులో ఉన్న మన దేశ సార్వభౌమత్వానికి సరిపడే అంశాలను సేకరించి సుదీర్ఘమైన లిఖిత, అలిఖత పూర్వకమైన రాజ్యాంగాన్ని తయారు చేసి మనకు అందించారన్నారు. రాజ్యాంగంలోని పీఠిక అనుసరించి మన దేశం సర్వసత్తాక సార్వభౌమ దేశంగా అభివృద్ధి పథంలో పయనించే విధంగా తయారు చేయబడిందని తెలిపారు. కనుక రాజ్యాంగాన్ని గౌరవించి దేశం పట్ల భక్తి కలిగి ఉండాలని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో మేజర్ పంచాయతీ ఈవో డిప్యూటీ ఎంపీడీవో కే.రామారావు, జడ్పీటీసీ సభ్యులు గణపం బాలకృష్ణారెడ్డి, మండల తెలుగుదేశం కన్వీనర్ గూడా నర్సారెడ్డి, గురజాల వెంకట రమణయ్య, ఏగినేని శ్రీనివాసన్ నాయుడు, కటకం ప్రసన్న కుమార్ వార్డు సభ్యులు లక్ష్మీ నారాయణ, కార్యాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## విభిన్న ప్రతిభావంతులను ఆదరించాలి



**కావలి, నవంబర్ 26, ప్రభాతవార్త:** విభిన్న ప్రతిభావంతులను ఆదరించి వారికి చేతనైన సహాయం అందించాలని కావలి ఒకటవ పట్టణ ఎస్సై ఎస్.కే జమాల్ కోరారు.కావలి పట్టణంలోని విశ్వశాంతి ఉన్నత పాఠశాల నందు బుధవారం హ్యాపీ సేవాసంస్థ వ్యవస్థాపక అధ్యక్షులు సయ్యద్ ఘని బాష ఆధ్వర్యంలో ముసునూరు నివాసి నిరుపేద దివ్యాంగుడు బాజీ,ఆశీయ దంపతుల కుమార్తె వివాహము ఈనెల 30వ తేదీన జరుగుతున్నందున కీర్తి శేషులు మీరాసాహెబ్ జ్ఞాపకార్థం వారికుమారులు మస్తాన్ ,నౌషాద్ ల దాతృత్వంతో రెండు బస్తాలు బియ్యం కొంత నగదును అందజేయడం జరిగింది.ఈ సందర్భంగా ఎస్సై ఎస్.కె.జమాల్, గౌరవ అధ్యక్షులు ఎస్.కె బాషలు మాట్లాడారు హ్యాపీ సేవాసంస్థ అధ్యక్షులు సయ్యద్ ఘని బాష దాతల సహకారములతో, పేద,బడుగు, బలహీన వర్గాలు, దివ్యాం గులకు, ఎన్నో సామాజిక సేవా కార్యక్రమములు చేస్తున్నారని,ఒక చిన్న సైకిల్ షాప్ ద్వారా జీవనోపాధి సాగిస్తూ ఎంతో మందికి సేవ చేస్తున్నారని చేస్తున్నారని వారిని అభినందించడం జరిగింద.ఈ కార్యక్రమంలో విశ్వశాంతి రమణయ్య,రత్నమ్మ ఫౌండేషన్ ప్రసాద్ రావు,విశ్రాంత లైబ్రరియన్ ప్రభాకర్ రావు, దేవరకొండ విజయ్, కరీముల్ల,సాయిశివ,నాగరాజు, హాజరత్తయ్య,తదితరులు పాల్గొన్నారు.

## బోగోలు లో రాజ్యాంగ ఆమోద దినోత్సవం




**బిట్రగుంట నవంబర్ 26 ప్రభాతవార్త :** మండలకేంద్రమైన బోగోలులో బుధవారం డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ గారి విగ్రహం వద్ద భారత రాజ్యాంగ ఆమోద దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా అంబేద్కర్ విగ్రహానికి ఎస్సి, ఎస్టి జెఏసి జిల్లా గౌరవ అధ్యక్షులు జ్యోతి సోమశేఖర్ వరప్రసాద్ రాజ్యాంగం గొప్పతనం గురించి మాట్లాడారు.ఈ కార్యక్రమంలో బోగోలు మండల జెఏసి చైర్మన్ బత్తుల రవిచంద్ర, ప్రధాన కార్యదర్శి బుర్రి వెంకటరావు, సభ్యులు దుగ్గిరాల వీరంబట్లు, పసుపులేటి రాంబాబు, కుందుర్తి చిన్న, నెల్లూరు నగర చైర్మన్ ఎందోటి మైకేల్ పాల్గొన్నారు.

## శాస్త్రోక్తంగా బాలాలయ విగ్రహాల నిమజ్జనం



**ముత్తుకూరు, నవంబర్ 26, ప్రభాతవార్త :** ముత్తుకూరు మండలం కృష్ణపట్నం గ్రామంలో ప్రసిద్ధి వైష్ణవ క్షేత్రమైన శ్రీ రుక్మిణి సత్యభామ సమేత శ్రీ వేణుగోపాల స్వామి వారి బాలాలయ విగ్రహాల నిమజ్జనోత్సవం కృష్ణపట్నం ఆలయాల చైర్మన్ మామిడాల శ్రీనివాసులు ఆధ్వర్యంలో బుధవారం వేద పండితులచే శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక దేవస్థానం నుంచి ప్రారంభమై కృష్ణపత్నం తీరంలో విగ్రహాలను నిమజ్జనం చేసారని ఆలయ ఈఓ గిరికృష్ణ తెలిపారు. ఈ నిమజ్జనోత్సవంలో టిడిపి నాయకులు మండల తెలుగు యువత అధ్యక్షులు రాగాల శివకృష్ణ, పసుపులేటి గోవిందయ్య, వాకాడు చంగయ్య, బొట్టు నారాయణ, పులి నాగేంద్ర, దేవస్థాన కమిటీ సభ్యులు, గ్రామస్తులు, మహిళలు పాల్గొన్నారు.

## మండల పరిషత్ పాఠశాలను సందర్శించిన ఎంఈఓ 2 ఎం. శోభనాద్రి



**పొదలకూరు, నవంబర్ 26, ప్రభాతవార్త :** వడ్డిపాలెం, నల్లపాలెం మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలను పొదలకూరు మండల విద్యా శాఖ అధికారి 2 ఎం. శోభనాద్రి బుధవారం సందర్శించారు. ఈ సందర్భంగా పాఠశాలలో విద్యార్థుల సామర్థ్యాలను పరీక్షించారు. అదే విధంగా పాఠశాలల అన్ని రికార్డ్స్‌ను పరిశీలించడం జరిగింది. ఉపాధ్యాయులకు సలహాలు సూచనలు చేసారు. ఎఫ్ఎల్ఎన్ బేస్ లైన్ టెస్ట్ జరుగు విధానాన్ని అడిగి తెలుసుకున్నారు. డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజనంను విద్యార్థులతో కలిసి తినడం జరిగింది. వంట తయారు చేసే వారికి కూడా సూచనలు చేసారు.

## మాజీ ఎమ్మెల్యే ఆరోగ్యంగా కోలుకోవాలని పూజలు



**బిట్రగుంట నవంబర్ 26 ప్రభాతవార్త** బోగోలు మండలం విశ్వనాధరావుపేట పంచాయతీ రామస్వామిపాలెంలో వేంచేసియున్న శ్రీ సర్వేశ్వరుని ఆలయంలో బుధవారం బత్తల నాగమణి మరియు బత్తల మల్లికార్జున ఆధ్వర్యంలో కావలి మాజీ శాసనసభ్యులు రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి ఆరోగ్యం త్వరగా కుదుటపడాలని ఆయన త్వరగా ప్రజా జీవితంలో పాలుపంచుకోవాలని కోరుకుంటూ పూజల నిర్వహించడం జరిగినది.

## మోంతా తుఫాను బాధితులకు నిత్యావసరాల పంపిణీ



**తోటపల్లి గూడూరు, నవంబర్ 26, ప్రభాతవార్త :** మండలంలోని మోంతా తుఫాను ప్రభావంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్న గిరిజన కుటుంబాలకు సహాయంగా చైతన్య జ్యోతి వెల్ఫేర్ సొసైటీ, జయవర్ధన్ చారిటబుల్ ట్రస్ట్ సంయుక్తంగా నిత్యావసర సరుకులను పంపిణీ చేశారు. మండలంలోని వీలుకానిపల్లి, వెంకన్నపాలెం, రవీంద్రపురం, శివరాంపురం, కొల్లిదిబ్బ, గణపతి నగర్ గ్రామాల్లో మొత్తం 197 పేద గిరిజన కుటుంబాలకు ఈ సాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో చైతన్య జ్యోతి వెల్ఫేర్ సొసైటీ ప్రాజెక్ట్ డైరెక్టర్ ఇరగనబోయిన శ్రీనివాసరావు, ఫౌండర్ జయలక్ష్మి, జయవర్ధన్ చారిటబుల్ ట్రస్ట్ సెక్రటరీ గంటా వెంకట రవికుమార్ పాల్గొన్నారు.అదనంగా పేడూరు గ్రామానికి చెందిన సోమిరెడ్డి రేవంత్ రెడ్డి, ముత్యాల సీనయ్య, వీలుకానిపల్లి సర్పంచ్ జి.పావని, వెంకటేశ్వర్లు, పంచాయతీ సెక్రటరీలు మురళీకృష్ణ, పెంచలయ్య, ప్రాజెక్టు కోఆర్డినేటర్లు శ్రీనివాస్, పద్మావతి, గురుదేవి, కనకాద్రి, సుజిత్, సంపత్, గ్రామ పెద్దలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సిజేడబ్ల్యూయస్ కమ్యూనిటీ సోషల్ వర్కర్ గిరిజన బాలికలు, మహిళలకు చైతన్యపరచి బాలివివాహాలపై అవగాహన కల్పించారు. 18 సంవత్సరాలు నిండే వరకు వివాహం చేయకూడదని గ్రామాల్లోని గిరిజన మహిళలతో ప్రమాణం చేయించారు. గ్రామ ప్రజలు ఈ సహాయానికి సంఘాలకు కృతజ్ఞతలు తెలిపారు.

## మాచర్లవారి పాలెం గిరిజనకాలనీలో సమస్యలపై జనసేన నేతల పర్యటన



**తోటపల్లి గూడూరు, నవంబర్ 26, ప్రభాతవార్త :** మండలంలోని మాచర్లవారి పాలెం గిరిజన కాలనీలో సర్వేపల్లి నియోజకవర్గ జనసేన పార్టీ సమన్వయకర్త బొబ్బేపల్లి సురేష్ నాయుడు, ఏఎంసీ డైరెక్టర్ గుమ్మినేని వాణి భవాని నాయుడు బుధవారం పర్యటించారు. గిరిజన కాలనీలోని సమస్యలను స్వయంగా అడిగి తెలుసుకున్నారు. పర్యటనలో భాగంగా స్థానిక అంగన్వాడి కేంద్రాన్ని పరిశీలించిన నేతలు ఇటీవలి వర్షాలకు పైప్‌లైన్ పగిలి, నీరు కేంద్రంలోకి చేరడంతో మూడు రోజుల పాటు చిన్నారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారని పేర్కొన్నారు. నీటి నిల్వలు ఏర్పడకుండా అవసరమైన చర్యలు తీసుకునేందుకు ప్రయత్నిస్తామని తెలిపారు. గ్రామ అభివృద్ధి కోసం సర్వేపల్లి శాసనసభ్యులు సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి సహకారంతో పని చేస్తామని, చిన్నారులకు ఆటస్థలం ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. కూటమి ప్రభుత్వం స్థానిక సమస్యల పరిష్కారానికి కట్టుబడి ఉందని వారు స్పష్టం చేశారు. గత ప్రభుత్వం నాడు–నేడు పనులపై విమర్శలు చేసిన నేతలు ప్రతి కుటుంబానికి గృహవసతి కల్పించేందుకు కూటమి ప్రభుత్వం కృషి చేస్తోందని తెలిపారు. ఈ సందర్భంగా గిరిజనులు తమ సమస్యలను వివరించగా, వాటిని దశలవారీగా పరిష్కరిస్తామని జనసేన నేతలు హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో గిరిజన కాలనీ వాసులు, జనసేన పార్టీ నాయకులు పాల్గొన్నారు.

## ఆర్ఆర్ ఫ్యామిలీ రెస్టారెంట్‌ను ప్రారంభించిన ఎమ్మెల్యే



**కావలి, నవంబర్ 26, ప్రభాతవార్త:** కావలి రూరల్ మండలం గౌరవరం జాతీయ రహదారి ప్రక్కన అన్ని వసతులతో ఆహ్లాదకరమైన వాతావరణంలో రుచికరమైన,నాణ్యతతో కూడిన ఎంతో రుచికరమైన ఆహార పదార్థాలను అందజేసే ఆర్ఆర్ ఫ్యామిలీ రెస్టారెంట్‌ను కావలి ఎమ్మెల్యే దగుమాటి వెంకటకృష్ణారెడ్డి బుధవారం ప్రారంభించడం జరిగింది.ఈ సందర్భంగా రెస్టారెంట్ యజమానులు చేజర్ల శ్రీనివాసులు రెడ్డి దంపతులను ఎమ్మెల్యే దగుమాటి ఆశీర్వదించి అభినందనలు తెలియజేశారు.కష్టమర్లకు నాణ్యమైన ఆహారం అందించి,సేవలతో కస్టమర్ల మనసులు గెలుచుకోవాలని ఎమ్మెల్యే కోరారు.ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు,కార్యకర్తలు, పాల్గొన్నారు.

## దేశానికి రాజ్యాంగం ఆత్మ వంటిది :ఎంఈవో




**కావలి, నవంబర్ 26, ప్రభాతవార్త:** దేశానికి రాజ్యాంగం ఆత్మ వంటిదని రాజ్యాంగం గురించి, రాజ్యాంగ విలువల గురించి విద్యార్థులు తెలుసు కోవాలని కావలి మండల విద్యాశాఖ అధికారి బండి గోవిందయ్య తెలియజేశారు. రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా స్థానిక జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాల నందు బుధవారం రాజ్యాంగ దినోత్సవ సంబరాలు ఘనంగా నిర్వహించి డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించడం జరిగింది.ఈ కార్యక్రమానికి ఎంఇఓ గోవిందయ్య ముఖ్య అతిథులుగా పాల్గొని పాఠశాలలో విద్యార్థుల ద్వారా మోడల్ అసెంబ్లీ నిర్వహించడం జరిగింది. విద్యార్థులు మోడల్ అసెంబ్లీ గా ఏర్పడి ఒకవైపు అధికారపక్షం, మరోవైపు ప్రతిపక్షంగా ఉండి అసెంబ్లీని నిర్వహించారు.అనంతరం ఎంఇఓలు బండి గోవిందయ్య, సిహెచ్ వెంకటసుబ్బయ్యలు మాట్లాడారు స్వేచ్ఛ, సమానత్వం,సౌభ్రాతృత్వం మొదలగు వాటిని గురించి వివరిస్తూ డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ కృషి ఫలితంగా ప్రపంచంలో కెల్లా అతి పెద్ద రాజ్యాంగాన్ని రూపొందించుకొని దేశాన్ని ముందుకు తీసుకెళుతున్నట్లు తెలియజేశారు. పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో పాఠశాలలోని ఉపాధ్యాయినీ, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## విజేత విద్యార్థులకు బహుమతి ప్రధానం



**వింజమూరు, నవంబర్ 26, ప్రభాతవార్త :** వింజమూరులోని నడిమూరు నందిలి బాలికోన్నత పాఠశాల నందు ఐసీడీఎస్ ఆధ్వర్యంలో నిర్వహించిన వ్యాసరచన పోటీలలో విజేతలైన విద్యార్థినులకు బుధవారం బహుమతులు ప్రధానం చేశారు. బాలల దినోత్సవం పురష్కరించుకుని 14వ తేదీన ఐసీడీవెస్ ఆధ్వర్యంలో 9, 10వ తరగతి విద్యార్థులకు బేటీ బచావో బేటీ పడావో అంశంపై నిర్వహించిన వ్యాసరచన పోటీలలో విజేతలైన బాలికలకు బుధవారం రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా బహుమతి ప్రధానం చేశారు. ఈ కార్యక్రమం సందర్భంగా సీడీపీవో పద్మజ కుమారి, ప్రధానోపాధ్యాయుని నాగలక్ష్మి మాట్లాడుతూ విద్యార్థులకు రాజ్యాంగ దినోత్సవ సందర్భంగా శుభాకాంక్షలు తెలియజేశారు. బాల్య వివాహాల వల్ల జరిగే అనర్థాలను వాటి దుష్ప్రరిణామాలను తెలియజేశారు. అలాగే బాల్య వివాహాలు జరిగినట్లయితే ప్రభుత్వ హెల్ప్‌లైన్ నెంబర్‌కు అందించాల్సిన అవసరం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్ టి.తేజస్విని, పాఠశాల ఉపాధ్యాయ బృందం అంగన్‌వాడీ కార్యకర్తలు ఉన్నారు.

## మద్యంసీసాలు స్వాధీనం



**బిట్రగుంట నవంబర్ 26ప్రభాతవార్త :** బోగోలు మండలం నాగులవరం గ్రామంలో బుధవారం చెట్టుపల్లి. వెంకయ్య అనే వ్యక్తి యాబై బ్రాంది మద్యం సీసాలు అనధికారికంగా విక్రయిస్తుండగా నెల్లూరు ప్రొబిషన్ ఎన్ఫోర్స్‌మెంట్ అధికారిణి అనిత ఆధ్వర్యంలో దాడులు చేసి పట్టుకొన్నట్లు కావలి సీఐ శ్రీనివాసులు తెలిపారు. నిందితుడు ప్రస్తుతం మండలంలోని విశ్వనాధరావుపేట జిల్లాపరిషత్ హైస్కూల్ వద్ద నివాసం ఉంటున్నాడని పేర్కొన్నారు. ఈ దాడులలో హెడ్కానిస్టేబుల్‌లు, కానిస్టేబుల్‌లు పాల్గొన్నారు.

## వీవీపాలెంలో రాజ్యాంగదినోత్సవం



**వలేటివారిపాలెం నవంబరు 26 ప్రభాతవార్త :** నవంబరు 26వ తేదీకి భారతదేశంలో చాలా ప్రాముఖ్యత ఉందని స్థానిక ఎంపీడీవో వైశంకరరావు అన్నారు.1949నవంబరు 26న భారత రాజ్యాంగసభ అంబేద్కర్ అధ్యక్షతన లిఖించిన రాజ్యాంగాన్ని ఆమోదించిన రోజ న్నారు. ఆ తరువాత 1950జనవరి 26న సదరు రాజ్యా ంగం అమలులోకి వచ్చిందన్నారు. ఈమేరకు ఆయన బుధవారం భారత రాజ్యాంగ దినోత్సవాన్ని వలేటివారిపాలెంలో నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక ఎంపీడీవో కార్యాలయములో డా॥ బిఆర్.అంబేద్కర్ చిత్రపటానికి ఆయన ఈవోఆర్డీ నారాయణరావుతో కలిసి పూలమాల వేసి నివాళి అర్పించారు. పంచాయతీ కార్యదర్శి రవికుమార్ సిబ్బందిచే ప్రతిజ్ఞ చేయించారు.ఈ కార్యక్రమంలో ఎంపీడీవో, వై శంకరరావు, డిప్యూటీ ఎంపీడీవో నారాయణరావు,ఏపీవో దయాసాగర్‌రావు కార్యాలయ సిబ్బంది శ్రీనివాసులు,కొండయ్య,జరీనా,రాణితోపాటు పలువురు పాల్గొన్నారు.

## ఆర్ఎస్ఆర్‌లో ఘనంగా జాతీయ న్యాయ దినోత్సవం



**బిట్రగుంట నవంబర్ 26 ప్రభాతవార్త :** బోగోలు మండలం కడనూతల గ్రామంలో గల రామిరెడ్డి సుబ్బరామిరెడ్డి ఇంజనీరింగ్ కళాశాలలో భారతదేశ జాతీయ న్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకొని సిఎస్ ఈ డిపార్ట్మెంట్ ఆధ్వర్యంలో ఎన్ఎస్ఎస్ సహాయ సహకారాలతో ఘనంగా జరిపినట్లు కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ పివిఎన్ రెడ్డి తెలిపారు. వారు ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రతి సంవత్సరం నవంబరు 26న భారతదేశంలో న్యాయ దినోత్సవాన్ని జరుపుకోవాలని 1979లో నాటి సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తి ప్రకటించారనీ, అయితే 1949లో భారత రాజ్యాంగ కమిటి రాజ్యాంగ ముసాయిదాను చేపట్టి కమిటీ సభ్యులు 1949 నవంబరు 26వ తేదీన తొలి ముసాయిదా ప్రతులపై సంతకాలు చేశారనీ, కానీ 1950 జనవరి 26వ తేదీ నుంచి అమల్లోకి వచ్చిందని తెలిపారు. అలాగే రాజ్యాంగ మౌలిక లక్ష్యం సామాజిక, ఆర్థిక, రాజకీయ న్యాయాన్ని అందరికీ అందించడం. కాబట్టి రాజ్యాంగ ముసాయిదా ప్రతుల తొలి సంతకాల రోజైన నవంబరు 26వ తేదిని జాతీయ న్యాయదినోత్సవంగా ఎంచుకున్నారు. ఈ దినోత్సవం నాడు న్యాయవాదులు సమావేశమై న్యాయాన్ని కాపాడుతామని న్యాయ ప్రతిజ్ఞ చేశారని కూడా తెలిపారు. అనంతరం అధ్యాపకులు విద్యార్థిని విద్యార్థులు రాజ్యాంగము ప్రకారము ప్రతి పౌరుడు నడుచుకోవాలని, గుర్తు చేసుకోవాలని, పాటించాలని ప్రతిజ్ఞ కూడా చేశారు. ఈ కార్యక్రమంలో కళాశాల ఏవో ఆర్ వి రమణారెడ్డి, సి ఎస్ సి హెచ్ ఓ డి కే రమేష్, ఎన్ ఎస్ ఎస్ సమన్వయకర్త ఏ కిరణ్ కుమార్, అధ్యాపకులు అధ్యాపకేతర సిబ్బంది ఎన్ఎస్ఎస్ విద్యార్థులు తదితరులు పాల్గొని విజయవంతం చేశారు.

## హెల్మెట్ దారణపై ప్రజలకు పోలీసులు అవగాహన

**కలిగిరి, నవంబర్26, ప్రభాతవార్త;** ద్విచక్రవాహన దారులు వాహనాలు నడిపే సమయంలో హెల్మెట్ తప్పనిసరిగా వాడాలంటూ కలిగిరి యస్ఐ ఉమాశంకర్ తెలిపారు. బుదవారం కలిగిరి మండలంలోని పెద్దపాడు సర్కిల్ వద్ద గ్రామస్తులు వామన దారులతో యస్ఐ అవగాహన సదస్సు నిర్వహించారు. ఈసందర్భంగా యస్ఐ మాట్లాడుతూ ప్రతి ఒక్కరికీ ద్విచక్ర వాహనాలు ఉన్నాయని, ప్రతి ఒక్కరూ బయటకు వెళ్లే సమయంలో ద్విచక్ర వాహనాలలోనే వెళ్తుంటారన్నారు. అయితే కొందరు మాత్రమే హెల్మెట్ వాడుతున్నారన్నారు. మిగిలిన వారుకూడా తప్పని సరిగా హెల్మెట్ వాడాలన్నారు. లేనిచో ప్రమాదాలు జరుగుతాయన్నారు. మీరు బయటకు వెళ్లే సమయంలో వాహనాలను సైతంతగ జాగ్రత్తగా నడపాల్సి ఉంటుందన్నారు. ప్రస్తుతం ఎక్కడ చూసినా వాహనాల వల్లనే అదిక ప్రమాదాలు జరుగుతున్నాయన్నారు. హెల్మెట్ దరిచినందువల్ల మీ కుటుంబాలు సైతం సంతోషంగా ఉంటాయన్నారు.

## భారత రాజ్యాంగ దినోత్సవ వేడుకలు



**కొడవలూరు,నవంబర్ 26 ప్రభాతవార్త:** రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ రాజ్యాంగంలో పొందుపరిచిన అంశాల ఆధారంగా అందరూ స్వేచ్ఛాయుత వాతావరణంలో జీవిస్తున్నామంటే మహనీయుడు అంబేద్కర్ పుణ్యమని తహశీల్దార్ కె.స్ఫూర్తి రెడ్డి పేర్కొన్నారు. భారత రాజ్యాంగ దినోత్సవ వేడుకలు కొడవలూరు తహశీల్దార్ కార్యాలయంలో ఘనంగా జరుపుకున్నారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ 2015 నుండి ప్రతిసంవత్సరం రాజ్యాంగ దినోత్సవం జరుపుకోవాలని కేంద్ర ప్రభుత్వం తీర్మానిస్తూ ప్రచురించడం జరిగిందన్నారు. అంతకముందు అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి సర్వసత్తాక సామాజిక లౌకిక ప్రజాస్వామ్య గణతంత్ర రాజ్యంగా ఏర్పాటు చేయాలని ,పౌరులందరికీ వీటిని భద్రపరచాలని నిశ్చయించుకున్నాము,న్యాయం, సామాజిక, ఆర్థిక రాజకీయ ఆలోచన, వ్యక్తీకరణ, నమ్మకం, విశ్వాసం మరియు ఆరాధనలో స్వేచ్ఛ హోదా అవకాశాల సమానత్వం వారందరిలో ప్రోత్స హించడం వ్యక్తి గౌరవాన్ని దేశ ఐక్యతను సమగ్రతను కాపాడే సోదరభావం,1949 నవంబర్ 26 మన రాజ్యాంగ సభలో రాజ్యాంగాన్ని స్వీకరించి, చట్టబద్ధం చేసి మనకు మనం ఇచ్చుకుంటున్నామని ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో ఏ ఎస్ ఓ గాయత్రి, రెవెన్యూ గ్రామ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## 50 లక్షలతో రాజగోపురం కు శంకుస్థాపన



**కొడవలూరు, నవంబర్ 26 ప్రభాతవార్త:** మండల ంలోని వెంకన్న పురం గ్రామంలో వెలసియున్న శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయంలో నూతన రాజగోపురం కి ఐఏఎస్ రిటైర్డ్ అధికారికృష్ణయ్య దంపతులు, కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి లు బుధ వారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా కృష్ణయ్య మాట్లాడుతూ ఎన్నో ఏళ్ల నుండి రాజగో పురం నిర్మాణం చేయాలని, ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి సహకారం, తిరుమల తిరుపతి దేవస్థానం పాలక మండలి సభ్యురాలు ప్రశాంతి రెడ్డి ఆధ్వర్యంలో 50 లక్షలతో ఈ నిర్మాణం చేయడం జరుగుతుందని తెలిపారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ ఇంత మంచి దైవ కార్యక్రమాన్నికి కృష్ణయ్య ముందుకు రావడం ఆలయ అభివృద్ధికి తోడ్పడడం సంతోషకరమైన విషయమని కొనియాడారు. మండల ఇంచార్జ్ ముంగమూరు శ్రీహరి రెడ్డి, కరకట మల్లికా ర్జున్, మండల అధ్యక్షులు నా పవెంకటేశ్వర్లు నాయుడు, పల్లం సురేష్ రెడ్డి, కోవూరు వెంకీ తది తరులు పాల్గొన్నారు.

